
ఈనాడు ఆదివారం

9 నవంబరు 2025



కళ్లజోడు... స్మార్ట్‌గా చూడు!




ప్రతివారిలో... ఓ పసిబిడ్డ!

ఓటమి నేర్పే పాఠాలు గొప్పవి!

అనుకున్నది జరగకపోతే బాధపడటం, ఓటమి ఎదురైతే కుంగిపోవడం సాధారణమే. కానీ, కొందరు మాత్రమే అక్కడితో ఆగిపోకుండా లక్ష్యం దిశగా సాగుతుంటారు... వైఫల్యాలకు వెరవకుండా, అవి నేర్పిన పాఠాలనే సోపానాలుగా మార్చుకుంటూ విజేతలుగా నిలుస్తుంటారు. వీళ్లూ ఆ కోవకు చెందినవారే..!


వైఫల్యంలోంచి వచ్చిందే స్కార్పియో -ఆనంద్ మహీంద్రా

ఓ వ్యాపారం చేస్తున్నప్పుడు విజయాలతోపాటు వైఫల్యాలూ సహజమే అయినా లక్ష్యంపైనే దృష్టిపెట్టాలి. కొన్నాళ్లక్రితం ఫోర్డ్ సంస్థతో కలిసి ఎస్కార్ట్ కారును తయారుచేశాం. మా ఇంజినీర్లు రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసినా దాన్నెవరూ కొనలేదు. తర్వాత ఫోర్డ్ సంస్థతో ఒప్పందం రద్దయ్యింది. మేమూ ఆర్థికంగా నష్టపోయాం. మా పని అయిపోయిందని కొందరు అనుకున్నా నేను దాన్ని డెడ్ ఎండ్ అనుకోలేదు. మా ఇంజినీర్లతోనే మళ్లీ మాట్లాడి, ఎస్కార్ట్ తయారీలో టెక్నికల్‌గా చేసిన పొరపాట్లు, డిజైన్, ధర... ఇలా అన్నింటినీ మరోసారి చర్చించా. ఆ అనుభవంతో ఇంకాస్త ఆధునికంగా, కస్టమర్లను ఆకట్టుకునేలా స్కార్పియోను విడుదల చేశాం. అది పెద్ద సక్సెస్ అయ్యింది. భయాన్ని అధిగమిస్తేనే గెలుపు ఉంటుందని నేను నమ్మడం వల్లే అది సాధ్యమైందనుకుంటా.



తొందరపడకూడదని అనుకున్నా - సునీల్ మిత్తల్

డిగ్రీ పూర్తయ్యాక మా నాన్నలా రాజకీయాల్లోకి కాకుండా వ్యాపారం చేయాలని సైకిల్ విడిభాగాల తయారీని ప్రారంభించా. దాంతోపాటుగా మరికొన్నీ చేశా. అవేవీ ఆశించిన లాభాలను తెచ్చిపెట్టలేదు. వ్యాపారం చేయాలనుకున్నప్పుడు తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదనీ, పొరపాట్లు జరిగినప్పుడు బాధపడటం కన్నా వీలైనంత త్వరగా వాటిని సరిదిద్దుకోవాలనీ ఆ వైఫల్యాల నుంచే నేర్చుకున్నా. జీవితంలో మార్పు సహజమని భావిస్తూనే నెమ్మదిగా భారతీ టెలికాం లిమిటెడ్‌ను ప్రారంభించి ఎయిర్‌టెల్‌ను తీసుకొచ్చా. జియో వచ్చినప్పుడు మేమూ దానికి పోటీగా 5జీ, ఎయిర్‌టెల్ బ్లాక్... వంటివి తీసుకొస్తూనే నెట్‌వర్క్ సమస్యల్ని తగ్గించుకునేందుకు ప్రయత్నించాం. ప్రారంభంలో రకరకాల వ్యాపారాలు చేస్తున్నప్పుడు ఆర్థిక సమస్యలు ఎదురై స్నేహితుల సాయం కోరేవాడిని. క్రమంగా సప్లయర్లకూ, ఉద్యోగులకూ సమయానికి డబ్బు ఇచ్చేందుకు విడిగా కొంత మొత్తాన్ని పక్కన పెట్టడం అలవాటు చేసుకున్నా. పొరపాట్ల నుంచే కదా.. అనుభవాలు వచ్చేది.




లూజర్స్‌తోనే వ్యాపారం చేస్తా -నిఖిల్ కామత్

నేను స్కూల్లో ఉన్నప్పుడు సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లను కొని అమ్మేవాడిని. ఓరోజు అమ్మకు అది తెలిసి తిట్టి వాటిని టాయిలెట్‌లో పారేసింది. అదే నా మొదటి వైఫల్యం. చదువును మధ్యలో మానేయాల్సి వచ్చినప్పుడు అందరిలా చదువుకోవట్లేదని బాధపడినా... ఖాళీగా కూర్చోకుండా స్టాక్ మార్కెట్, ట్రేడింగ్ మెలకువలు తెలుసుకుని క్రమంగా జెరోధాను ప్రారంభించా. వైఫల్యాలతో పోలిస్తే విజయాల నుంచి నేర్చుకునేది పెద్దగా ఉండదని నమ్ముతా. 'ఒకవేళ ఇదంతా పోతే...' అని ఎప్పుడూ ఆలోచిస్తుంటా. అందుకే ప్రతిరోజూ కొత్త విషయాలు నేర్చుకుంటూ కష్టపడేందుకు ప్రయత్నిస్తా. అంతేనా... చాలామంది వ్యాపారవేత్తలు విజయాలు సాధిస్తున్న స్టార్టప్‌లపైనే పెట్టుబడి పెట్టేందుకు చూస్తారు. నేను మాత్రం లూజర్స్‌కి మొదటి ప్రాధాన్యం ఇస్తా. వాళ్లు తాము చేసిన పొరపాట్ల నుంచి నేర్చుకున్న పాఠాలతో ఏదో ఒక రోజు విజయం సాధిస్తారని నమ్మడమే అందుకు కారణం.




అది చివరిది కాదు - బిల్‌గేట్స్

రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన సన్నటి కేబుళ్ల సాయంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాల సంఖ్యను లెక్కించి... ఆ గణాంకాలను ప్రభుత్వానికీ, అవసరమైనవారికీ ఇవ్వడమే 'ట్రాఫ్ ఓ డేటా' సంస్థ పని. అదే నా మొదటి స్టార్టప్. ఈ ఆలోచన బాగున్నా లాభాలు లేక కొన్నిరోజులకే మూసేశాం. హార్వర్డ్ యూనివర్సిటీలో సీటు రావడమే గొప్ప అయినా నేను మధ్యలోనే బయటకు వచ్చేశా. ఇలాంటి సందర్భాల్లో నిరాశ చెంది ఉంటే నేను మైక్రోసాఫ్ట్‌ను ప్రారంభించి ఉండేవాడిని కాదు. ఆ రెండు సందర్భాల్లో మాత్రమే కాదు ఎప్పుడు ఏ అవరోధం ఎదురైనా అది నా ఆఖరిది కాదు అని మనసులో అనుకుంటా. బదులుగా భవిష్యత్తు పైనా మనసుకు నచ్చిన పని చేయడంపైనా దృష్టిపెడతా. అవసరమైతే ఎంత రిస్క్ అయినా తీసుకుంటా. వీటన్నింటితోపాటు మా సంస్థ గురించి ఎవరు ఎలాంటి ఫీడ్‌బ్యాక్ ఇచ్చినా ఆనందంగా ఆహ్వానిస్తా. ఈ ప్రయత్నాలే నన్ను నిలబెట్టాయి.



కోట్లు పోగొట్టుకున్నా - జెఫ్ బెజోస్

అమెజాన్ వ్యవస్థాపకుడిగా, ప్రపంచ కుబేరుల్లో ఒకడిగానే నన్ను అందరూ గుర్తిస్తారు కానీ నేను చేసిన వ్యాపార ప్రయోగాలూ, ఎదురైన వైఫల్యాలూ చాలానే ఉన్నాయి. కోట్ల రూపాయలనూ పోగొట్టుకున్నా. అయినా భయపడలేదు. నిజానికి నేను వైఫల్యాలను రెండు రకాలుగా చూస్తా. ఒకటి ఆపరేషనల్ ఫెయిల్యూర్... అంటే, తెలిసిన విషయాల్లో చేసే పొరపాట్లు. వాటికి ఎప్పటికప్పుడు ఫుల్‌స్టాప్ పెట్టేస్తుంటా. ఇక రెండోది ఎక్స్‌పరిమెంటల్ ఫెయిల్యూర్. ఏదైనా కొత్తది ఆవిష్కరిస్తున్నప్పుడు చేసే పొరపాట్లూ తద్వారా వచ్చే వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకుంటా. ఉదాహరణకు మేం తయారుచేసిన ఫైర్‌ఫోన్ అలాంటిదే. దానికి పెద్దగా ఆదరణలేక ఉత్పత్తిని ఆపేశాం. ఆ అనుభవంతో అలెక్సాను తీసుకొచ్చా. సూపర్‌హిట్ అయ్యింది. వీడియోగేమ్ తొలిసారి ఫెయిలైనా తర్వాత మరొకటి విడుదల చేయడం ఎక్స్‌పరిమెంటల్ ఫెయిల్యూర్‌లో భాగమే.



లోపల

మంచిమాట

అతిగా అరవడం వల్ల మాట విలువా, అనవసరంగా ఏడవడం వల్ల కన్నీటి విలువా తగ్గుతాయి.

దానికేం ఖర్చు...

సీత: అత్తయ్యా... కాసుల హారం చేయించుకోవాలనుకుంటున్నాను. సుమారు ఎంత అవుతుంది...

సావిత్రి: పిచ్చిదానా. ఎంత అమాయకురాలివే... అనుకోవడానికి ఏం ఖర్చవుతుందే!

అలాగా!

కోపం కళ్లలో ఉండాలి, బాధ గుండెల్లో ఉండాలి... ఇది పాత సామెత. కోపం వస్తే ఫేస్‌బుక్‌లో పోస్ట్ ఉండాలి. బాధ వస్తే వాట్సాప్‌లో స్టేటస్ ఉండాలి. ఇది కొత్త ట్రెండ్.

ఆ వీధిలో... వేల టన్నుల బంగారం!



బంగారంతో నిండిన గదుల్నీ, ఒకదానిమీద ఒకటి పేర్చిన బంగారు బిస్కెట్లనూ ఇటుకలనూ సినిమాల్లోనే చూస్తుంటాం. కానీ టన్నుల కొద్దీ బంగారంతో నిండిన అలాంటి చోటు నిజంగానే ఉంది. ఎక్కడో ప్రపంచానికి దూరంగానో, తెలియని ప్రదేశంలోనో కాదు... లండన్ మహానగరంలోని థ్రెడ్ నీడిల్ స్ట్రీట్‌లో. ప్రపంచంలోని అయిదో వంతు బంగారం- కడ్డీలూ, ఇటుకల రూపంలో ఈ వీధిలోనే కొలువై ఉంది. నిత్యం రయ్‌రయ్‌మంటూ కార్లూ, బస్సులూ దాని మీద నుంచే పరుగులు తీస్తాయి. నగరవాసులూ విలువైన నిధినిక్షేపాల పై నుంచే అటూ ఇటూ తిరిగేస్తుంటారు. అంత బంగారం ఏంటీ, దాని మీద నుంచి నడవడం ఏంటీ- అంతా విచిత్రంగా ఉందా! అసలు విషయం ఏమిటంటే- బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ భూగర్భంలో భద్రంగా దాచిన బంగారమే అదంతా. భూమి లోపల నిర్మించిన ఈ వాల్ట్ ప్రపంచంలోని అత్యంత భద్రమైన ప్రదేశాల్లో ఒకటి. న్యూయార్క్ ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ తర్వాత ఎక్కువ బంగారు నిల్వలు ఉన్న రెండో అతిపెద్ద స్వర్ణాగారమిదే! దీంట్లో దాదాపు 4,00,000 బంగారు కడ్డీలున్నాయి. ఒక్కో కడ్డీ లేదా ఇటుక బరువు 12.5 కిలోగ్రాములు. మొత్తం బంగారం బరువు సుమారుగా 5,000 టన్నులు. దీని విలువ రూ.63 లక్షల కోట్ల పైనే. ఇదంతా సరే, ఇంతకీ ఎవరిదబ్బా ఇదంతా అంటారా- ఈ స్వర్ణనిధిలో ఎక్కువ భాగం (దాదాపు 94 శాతం) ప్రపంచంలోని 30కి పైగా దేశాల కేంద్ర బ్యాంకులూ, పెద్ద పెద్ద సంస్థలదే. కేవలం 6 శాతమే లండన్‌కు చెందింది.

లండన్ సుదీర్ఘకాలంగా ప్రపంచ బంగారు మార్కెట్‌కు కేంద్రంగా ఉంది. రాజకీయ స్థిరత్వం కారణంగా అనేక దేశాలు తమ బంగారాన్ని ఇక్కడ సురక్షితంగా దాస్తున్నాయి. ఈ బ్యాంక్ చరిత్రలో ఇప్పటివరకూ ఒక్కసారి కూడా దొంగతనం జరగలేదంటే... దీని భద్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు!

- సందరగిరి రమ్య, ఈనాడు డిజిటల్, హైదరాబాద్

అవీ ఇవీ

భార్యకోసం... గిటార్ అడవి

ప్రేమించిన భార్య దూరమైతే విగ్రహం కట్టుకుని ఆరాధించేవాళ్లను చూశాం, ఆమె తలపుల్లో తలమునకలయ్యే





వారినీ చూశాం. కానీ అర్జెంటీనాకు చెందిన ఒక రైతు మాత్రం తన భార్య జ్ఞాపకార్థం ఒక అడవిని పెంచాడు, అది కూడా ఆమెకు ఎంతో ఇష్టమైన గిటార్ ఆకృతిలో. అర్జెంటీనాలోని పాంపాస్ ప్రాంతంలో నివసించే పెడ్రోమార్టిన్ యురెటా అనే రైతు తన భార్య గ్రాసియేలాని ఎంతగానో ప్రేమించాడు. కానీ పాతికేళ్ల చిన్న వయసులోనే మెదడుకు సంబంధించిన సమస్యతో గ్రాసియేలా మృతి చెందింది. ఆమె జ్ఞాపకార్థంగా తన పిల్లలతో కలిసి తమ పొలంలోనే ఏడువేల సైప్రస్, నీలిరంగు యూకలిప్టస్ చెట్లతో గిటార్ ఆకృతిలో ఒక అడవిని పెంచాడు. నలభై ఏళ్లుగా ఈ అడవి ఆకృతిని కాపాడుతూ వస్తున్నాడు. విమానంలోంచి చూసేవాళ్లకీ, శాటిలైట్లు తీసే చిత్రాల్లోనూ ఈ గిటార్ అడవి కంటికింపుగా కనిపిస్తూ, అతని ప్రేమ గొప్పతనాన్ని చాటుతోంది.

ప్రాణాలు కాపాడే బెంచీలు!



బయట చలి గజగజా వణికిస్తున్నప్పుడు, ఇంట్లో దుప్పటి కప్పుకుని పడుకోవడానికి మించిన హాయి మరొకటి ఉండదు. కానీ అందరికీ ఆ అదృష్టం ఉండొద్దూ! ఓ గూడంటూ లేక ఎండకు ఎండుతూ, వానకు తడిచే వాళ్ల సంగతేంటి? జపాన్ లాంటి దేశాల్లో అయితే కొన్ని ప్రాంతాల్లో రాత్రిపూట గాలికూడా గడ్డకట్టేంత చలి ఉంటుంది... మరి ఆ చలిలో ఇల్లులేనివాళ్లు ఎక్కడ ఉంటారు? ఇలానే ఆలోచించిన జపాన్ ప్రభుత్వం ఓ వినూత్నమైన ఆలోచన చేసింది. అక్కడ చలి ఎక్కువగా ఉండే హొక్కాయిడో, నిగాటా, ఓమోరీ వంటి కొన్ని ప్రాంతాల్లో రాత్రిపూట వేడెక్కే బెంచీలను ఏర్పాటు చేసింది. సోలార్ టెక్నాలజీని వాడి రూపొందించిన ఈ బెంచీలు పగటిపూట ఎండవేడిని గ్రహించి, రాత్రి పూట వెచ్చగా మారిపోతాయి. పార్కులూ, బస్టాపుల్లో ఈ బెంచీలని ఏర్పాటుచేసి చలి కారణంగా ప్రాణాలు పోగొట్టుకుంటున్న వారిని కాపాడే ప్రయత్నం చేస్తోంది అక్కడి ప్రభుత్వం.

రోడ్డుకి అటూఇటూ నాచు బోర్డులు!



ఎక్కడైనా హైవేల్లో రోడ్డుకి అటూఇటూ పచ్చని చెట్లు ఉండటాన్ని చూస్తాం.... కానీ సింగపూర్‌లో మాత్రం నాచుతో తయారుచేసిన 'ఆల్గే ప్యానెల్స్' కనిపిస్తాయి. చెట్లు పెరగడానికి వీలుగా లేని ఇరుకు రహదారుల వెంబడి సింగపూర్ ప్రభుత్వం ఈ ఆల్గే ప్యానెల్స్‌ని ఏర్పాటుచేస్తోంది. 'పట్టిపట్టిచూస్తే కానీ కనిపించని నాచుతో ఏం ప్రయోజనం?' అనుకుంటున్నారా... చెట్లతో పోలిస్తే ఈ నాచు స్తంభాలు వాహనాల నుంచి వెలువడిన కాలుష్యాన్ని ఎక్కువగా గ్రహించి, ఆక్సిజన్‌ని పుష్కలంగా విడుదల చేస్తాయట. అంతేకాదు వాహనాల రణగొణ ధ్వనులని గ్రహించి శబ్ద కాలుష్యాన్ని తగ్గిస్తాయట. అలాగే, ఉష్ణోగ్రతలనీ తగ్గించి వాతావరణాన్ని చల్లగా ఉంచుతాయట. స్ట్రీట్‌లైట్ల మాదిరిగా రహదారికి అటూఇటూ ఏర్పాటు చేసిన ఇవి పెద్దగా స్థలాన్ని ఆక్రమించకుండానే ఇన్ని ప్రయోజనాలను అందిస్తున్నాయి. అన్నట్టు, ఈ నాచు ఎండినా కూడా లాభమేనట. ఎందుకంటే ఆ ఎండిన ఆల్గేని సేకరించి దాంతో బయో ఫ్యుయెల్‌ని తయారుచేస్తోంది అక్కడి ప్రభుత్వం.

నోట్‌బుక్ తాత!

బెంగళూరులోని బ్యాంక్ కాలనీ ప్రాంతం తెల్లవారుజామున నాలుగింటికి చాలా సందడిగా ఉంటుంది. ఎందుకంటే అక్కడ



నుంచే పబ్లిష్ అయిన వేర్వేరు పత్రికలని పేపర్ బాయ్స్ తీసుకుని వేటికవే కట్టలు కట్టుకుని ఇంటింటికీ తీసుకెళ్తూ ఉంటారు. ఆ పనిని వాళ్లు చేసుకుంటూ ఉంటే, మోహన్ అనే 70 ఏళ్ల పెద్దాయన తన పని తాను చేసుకుంటూ ఉంటాడు. ఇంతకీ ఆయన చేసే పని ఏంటంటే... పత్రికాఫీసుల నుంచి పత్రికలు వచ్చేటప్పుడు వాటిని ఒక తెల్లని కాగితంలో చుట్టి తీసుకువస్తారు. ఆ తర్వాత ఆ కాగితాలని తీసి పారేస్తారు. అలా పారేసిన కాగితాలనే ఆ పెద్దాయన ఏరుకొచ్చి వాటిని సమానంగా కత్తిరించి నోట్‌బుక్స్ తయారుచేస్తాడు. అలా తయారుచేసిన పుస్తకాలని వారానికోసారి దగ్గర్లోని ప్రభుత్వ పాఠశాలకు తీసుకెళ్లి పిల్లలకు పంచిపెడతాడు. అందుకే అక్కడి పిల్లలు ఆయన్ని 'నోట్‌బుక్ తాతయ్య' అని ఆప్యాయంగా పిలుస్తారు. రిటైర్ అయిన తర్వాత తన సమయాన్ని ఇలా పిల్లల కోసం కేటాయిస్తున్నాడీ పెద్దాయన.





దక్షిణ కాశీగా విరాజిల్లే క్షేత్రం, శక్తిస్వరూపిణిగా దర్శనమిచ్చే జగన్మాత, పద్నాలుగు అడుగుల ఎత్తుతో పరమేశ్వరుడు, ఊరి చుట్టూ శివలింగాలు... ఇవన్నీ దక్ష వాటికగా పిలిచే ద్రాక్షారామంలో కనిపిస్తాయి. వందల సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ భీమేశ్వర ఆలయం పంచారామాల్లో ఒకటిగా, శక్తి పీఠాల్లో ప్రధానమైనదిగా సుప్రసిద్ధం కావడం విశేషం.

శివలింగం... పద్నాలుగు అడుగుల్లో!



ఓం నమఃశివాయ... పంచాక్షరీ మంత్రం ప్రతినిత్యం ప్రతిధ్వనించే పవిత్ర ధామం ద్రాక్షారామ భీమేశ్వర క్షేత్రం. సప్త గోదావరి సమీపాన, పచ్చని ప్రకృతి అందాల నడుమ వెలసిన ఈ ఆలయం తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రాపురం మండలంలోని ద్రాక్షారామంలో ఉంది. శ్రీశైలం, కాళేశ్వరం, ద్రాక్షారామాల నడుమ ఉన్న తెలుగు ప్రాంతానికే 'త్రిలింగ దేశం' అని పేరు వచ్చిందని అంటారు. అలాగే, పరమేశ్వరుడి ఆత్మలింగాన్ని ప్రతిష్ఠించిన అయిదు ప్రాంతాలను పంచారామాలుగా పిలుస్తారు. పంచారామాల్లో ఒకటైన ఈ భీమేశ్వర క్షేత్రంలోనే సతీదేవి ఎడమ చెంప భాగం పడిందనీ చెబుతారు. అలా, భారీ శివలింగంతోపాటు అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన మాణిక్యాంబనూ దర్శించుకునే భాగ్యం కలిగిస్తుంది ద్రాక్షారామం.

స్థల పురాణం

దేవతలూ, అసురులూ కలిసి పాల సముద్రాన్ని మథిస్తున్నప్పుడు ఆత్మలింగం కూడా ఉద్భవించిందట. తారకాసురుడు అనే రాక్షసుడు ఆ ఆత్మలింగాన్ని మెడలో ధరించి, మరణం లేకుండా వరం ఇవ్వమంటూ శివుడిని ఉద్దేశించి ఘోర తపస్సు చేశాడట. అప్పుడు స్వామి ప్రత్యక్షమై తన సంతతిపైన యుద్ధం చేయనంతవరకే మరణం ఉండదనీ, ఆ నిబంధనను ధిక్కరిస్తే మాత్రం తల వెయ్యి ముక్కలు అవుతుందనీ, ఆత్మలింగం అయిదు శకలాలుగా మారుతుందనీ హెచ్చరించి అంతర్ధానం అయ్యాడట. కాలక్రమంలో తారకాసురుడు ఆ విషయాన్ని మర్చిపోయి, శివుని కుమారుడైన కుమారస్వామితో తలపడ్డాడు. దీంతో, స్వామి చెప్పినట్టుగానే ఆ అసురుడి తల వెయ్యి ముక్కలైందట. అదే సమయంలో ఆత్మలింగం అయిదు భాగాలుగా విడిపోయిందట. దీంతో దేవతలు ఆ శకలాలను ఐదుచోట్ల ప్రతిష్ఠించారట. అవే పంచారామాలు. అందులో మొదటిదాన్ని ఇంద్రుడు అమరావతిలో, రెండోదాన్ని చంద్రుడు భీమవరంలో, మూడోదాన్ని విష్ణుమూర్తి పాలకొల్లులో, నాలుగోదాన్ని కుమారస్వామి సామర్లకోటలోని భీమేశ్వరంలో ప్రతిష్ఠించారట. మిగిలిన అయిదో భాగాన్ని సప్తరుషులు ద్రాక్షారామ ప్రాంతంలో ప్రతిష్ఠించాలనుకున్నారట. అయితే, అంతకు ముందు స్వామి విగ్రహాన్ని అభిషేకించాలనే ఉద్దేశంతో... తమ ఆధ్యాత్మిక శక్తితో గోదావరి జలాల్ని ఇక్కడికి తరలించేందుకు పూనుకున్నారట. ఆ ప్రయత్నం ఆలస్యం కావడంతో స్వామి తనంతట తానే ప్రతిష్ఠితుడై... స్వయంభువుగా కొలువుదీరాడనీ, తర్వాత సూర్యభగవానుడు దిగివచ్చి పరమేశ్వరుడిని పూజించాడనీ ప్రతీతి. చాళుక్య ప్రభువైన చాళుక్య భీముడు ఇక్కడ ఆలయాన్ని నిర్మించినట్లుగా శాసనాలు చెబుతున్నాయి.

108 శివలింగాలు...

నాలుగు ప్రవేశద్వారాలతో, ఎత్తయిన గోపురాలతో నిర్మితమైన ఈ ఆలయంలో గర్భగుడి రెండు అంతస్తుల్లో ఉంటుంది. శుద్ధ స్ఫటిక శివలింగం పద్నాలుగు అడుగుల ఎత్తుతో, రెండు అంతస్తుల మేర విస్తరించి, సందర్శకుల్ని అబ్బురపరుస్తుంది. భక్తులు మొదట పానవట్టంలో సగభాగాన్ని పూజించి, అక్కడే ప్రదక్షిణ పూర్తి చేసుకుని, ఆ తర్వాత మెట్లెక్కి రెండో అంతస్తుకు చేరుకుంటారు. స్వామి దర్శనం తర్వాత ఈ ప్రాంగణంలోనే అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన మాణిక్యాంబనూ పూజిస్తారు. అలాగే కాలభైరవ ఆలయం, త్రికూట ఆలయం, సోమవారం మండపం, రాతి స్తంభాలతో నిర్మించిన బేడా మండపం, అలనాటి శాస్త్ర పరిజ్ఞానానికి నిదర్శనంగా నిలిచిన నమూనా ఆలయం, ఊయల మండపం, వసంత మండపం కూడా భక్తులను ఆకట్టుకుంటాయి. ఆలయ ముఖ మండపంలో కనిపించే భారీ నందీశ్వరుడినీ దర్శించుకోవచ్చు. గుడి బయట రావిచెట్టు కింద కొలువుదీరిన అశ్వత్థ శంకరనారాయణుడితోపాటుగా... సప్తర్షులు తీసుకొచ్చిన సప్త గోదావరి పుష్కరిణిని చూసేందుకు రెండు కళ్లూ చాలవు. ఇక్కడ కొలువైన రుద్రమూర్తిని శాంతింపచేసేందుకు సాక్షాత్తు చంద్రుడే ఈ క్షేత్రం చుట్టూ ఎనిమిది శివాలయాలను నిర్మించాడట. అవే కోలంక, వెంటూరు, కోటిపల్లి, వెల్ల, దంగేరు, కోరుమిల్లి, సోమేశ్వరం, పెనుమళ్ల గ్రామాల్లోని సోమేశ్వర ఆలయాలు. ఇవి కాకుండా...ద్రాక్షారామం చుట్టుపక్కల భూగర్భంలో దొరికిన 108 శివలింగాలనూ ఆలయ ప్రాంగణంలోని రెండో ప్రాకారంలో భీమసభ పీఠంపైన ప్రతిష్ఠించారు. వాటినే అష్టోత్తర లింగాలుగా పిలుస్తారు. అలాగే, స్వామిపైన రోజూ రెండు పూటలా పడే సూర్యకిరణాలనూ చూసి తీరాల్సిందే. మహాశివరాత్రి, కార్తిక ఉత్సవాలతో పాటు ఏడాది పొడవునా నిర్వహించే విశేష పూజల్లో పాల్గొనేందుకు రెండు రాష్ట్రాల నుంచీ వేలాది భక్తులు ఇక్కడకు వస్తారు.


ఇలా చేరుకోవచ్చు...

ఈ ఆలయానికి రైల్లో రావాలనుకునే భక్తులు కాకినాడ, అనపర్తి, సామర్లకోట రైల్వే స్టేషన్‌లలో దిగితే సరిపోతుంది. అక్కడి నుంచి బస్సులూ, ఆటోలూ ఉంటాయి.

- నరాల త్రిమూర్తులు, న్యూస్‌టుడే, ద్రాక్షారామ







వైరస్‌ని అడ్డుకునే చూయింగ్ గమ్!

బాగా జలుబు చేస్తే ఉపశమనం కోసం ఓ మాత్ర వేసుకుంటాం... ఇది మనకు తెలిసిన వైద్యమే. ఇకపైన మాత్ర కాకుండా ఒక చూయింగ్ గమ్‌ని నమిలితే చాలు.. జలుబు తగ్గడంతోపాటు, ఇతరులకూ వ్యాప్తి చెందకుండా ఉంటుందని అంటున్నారు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా శాస్త్రవేత్తలు. నోటిని తాజాగా ఉంచే చూయింగ్ గమ్‌కి ఇన్ని ప్రయోజనాలెలా సాధ్యం అనుకుంటున్నారా? అవును, ఊదారంగులో ఉండే 'లాబ్‌లాబ్' అనే చిక్కుడుజాతి గింజల నుంచి తీసిన 'ఫ్రిల్' అనే ప్రొటీన్‌తో శాస్త్రవేత్తలు ఈ చూయింగ్‌గమ్‌ని తయారుచేశారు. మనం చూయింగ్ గమ్‌ని నమిలినప్పుడు దాన్నుంచి 'ఫ్రిల్' లాలాజలంలోకి విడుదలవుతుంది. ఈ ప్రొటీన్ సూక్ష్మమైన వైరస్ కణాలకి అతుక్కుపోయి, వాటి కదలికలను అడ్డుకుంటుంది. దాంతో జలుబుకు కారణం అయిన వైరస్ నిర్వీర్యం అవడంతోపాటు మరొకరికి వ్యాప్తిచెందదట. గతంలో ఉన్న మందులు మనలోని వైరస్‌ని చంపడానికి మాత్రమే ఉపయోగపడితే, ఈ యాంటీ వైరస్ చూయింగ్‌గమ్ ఇతరులకు అది వ్యాపించకుండా కూడా అడ్డుకుంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అన్నట్టు ఈ లాబ్‌లాబ్ చిక్కుడుకాయలు మనదేశంలోని తమిళనాడులోనూ పండుతాయట.

పాలిస్తే... క్యాన్సర్ నుంచి రక్ష!



బిడ్డ పుడితే ఏ తల్లికైనా సంతోషమే! ఆ ఆనందంతోపాటు బోనస్‌గా మరో ఆరోగ్య ప్రయోజనం కూడా అమ్మకు కానుకగా అందుతుందంటున్నారు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. ఇంతకీ ఆ ప్రయోజనం ఏంటంటే... మహిళల్లో ఎక్కువగా కనిపించే 'ట్రిపుల్ నెగెటివ్' అనే బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా ఉంటుందట. పాలిచ్చే తల్లుల్లో ఈ తరహా క్యాన్సర్ రాకపోవడానికీ, వచ్చినా వేగంగా నయం అవ్వడానికీ ఏదైనా కారణం ఉందా అనే దిశగా మెల్‌బోర్న్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పరిశోధించినప్పుడు తేలిన విషయాలివి. బిడ్డ పుట్టిన తర్వాత వక్షోజాల్లో 'సీడీ8+టీ' పేరుతో కొన్ని ప్రత్యేకమైన వ్యాధినిరోధక కణాలు ఏర్పడతాయి. ఇవి శక్తిమంతమైన రక్షకభటుల్లా పనిచేస్తూ, వక్షోజాల్లోని క్యాన్సర్ కణాలని ఎప్పటికప్పుడు చంపేస్తూ ఉంటాయట. బిడ్డ పుట్టకముందు వరకూ ఆడవాళ్లలో ఉన్న వ్యాధినిరోధక వ్యవస్థతో పోలిస్తే, బిడ్డ పుట్టి - పాలిస్తూ ఉన్న తల్లుల్లో వ్యాధినిరోధకశక్తి చాలా అప్రమత్తంగా ఉంటూ, క్యాన్సర్లని రాకుండా అడ్డుకుంటుందట. మరోవైపు హార్మోన్లని కూడా నియంత్రిస్తూ తల్లుల్లో క్యాన్సర్ రాకుండా చాన్నాళ్లపాటు రక్షణ వ్యవస్థని ఏర్పాటుచేస్తుందట.

పరిశోధన

రక్షించే టీషర్ట్!

మృదువుగా, మెత్తగా ఉండే దుస్తులని ధరించినప్పుడు సౌకర్యంగా ఉంటాయి. ఇవే దుస్తులు అవసరం అయినప్పుడు బుల్లెట్‌ప్రూఫ్‌లా మారి మనకు రక్షణ కల్పిస్తే? అవును, అలాంటి ప్రత్యేకమైన స్మార్ట్ వస్త్రాన్నే కనిపెట్టారు జర్మనీలోని ఫ్రాన్‌హోఫెర్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు. ఈ దుస్తులు సాధారణ సమయాల్లో మెత్తగా, మామూలు కాటన్ దుస్తుల్లానే ఉంటాయి, కానీ మనపైన అనుకోకుండా ఏదైనా దాడి జరిగితే మాత్రం... బుల్లెట్‌ప్రూఫ్ తరహాలో గట్టి రక్షణ కవచంలా మారిపోతాయి. ఇందుకోసం ఈ వస్త్రాన్ని తయారుచేసే నూలుపోగుల్లో కంటికి కనిపించనంత చిన్న పరిమాణంలో ఉండే ఎస్‌టీఎఫ్ నానోపార్టికల్స్(షీర్ థికనింగ్ ఫ్లుయిడ్)కణాలని వాడారు. బుల్లెట్, కత్తి వంటివేవైనా మనవైపు వేగంగా దూసుకొస్తుంటే ఆ వేగాన్ని గుర్తించిన కణాలు ఒకదానితో ఒకటి ఇంటర్‌లాక్ అయి ఒక బలమైన కవచంలా మారిపోయి రక్షణ కల్పిస్తాయి. బుల్లెట్‌ని కూడా అడ్డుకునే సామర్థ్యం ఉన్న ఈ స్మార్ట్ వస్త్రంతో పిల్లలకు కావాల్సిన యూనిఫాంలూ బ్యాక్‌ప్యాక్‌లూ, సాహసాలు చేసే వృత్తుల్లో ఉన్నవారికి దుస్తులూ... రూపొందించాలని అక్కడి ప్రభుత్వం ఆలోచిస్తోంది.



60ల్లోనే చురుగ్గా ఉంటారట...



కొత్తగా ఉద్యోగంలో అడుగుపెట్టినవాళ్లూ, పాతికలూ-ముప్ఫైల్లో ఉన్నవాళ్లూ చురుగ్గా పనిచేస్తారనీ... వాళ్లకు వేగంగా నిర్ణయాలు తీసుకునే శక్తి ఉంటుందనీ, ఏ విషయాన్నైనా ఇట్టే గ్రహించేస్తారనే అభిప్రాయం చాలామందిలో ఉంటుంది. అలాగే, యాభై- అరవైల్లో ఉన్నవారు అంత చురుగ్గా ఉండరనే ఆలోచనా ఉంటుంది... ఇలాంటి ఆలోచనలని మార్చుకోవాల్సిన సమయం వచ్చిందని అంటోంది యూనివర్సిటీ ఆఫ్ వెస్టరన్ ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు చేసిన అధ్యయనం. ఎందుకంటే... జ్ఞానం ఒక్క రాత్రిలో వచ్చేది కాదనీ, సుదీర్ఘకాలంపాటు జీవితంలో ఎదురయ్యే కొన్ని అనుభవాలూ పొరపాట్ల నుంచి క్రమంగా నేర్చుకునేదనీ అందుకే పాతికలూ, నలభైలలో ఉన్నవారితో పోలిస్తే... 55 నుంచి 65 ఏళ్ల మధ్య వయసులో ఉన్నవారు ఏ విషయంలో అయినా పూర్తి పరిణతితో వ్యవహరిస్తారనీ ఈ అధ్యయనం తేల్చింది. ఈ వయసులో తీసుకునే నిర్ణయాలు నిదానంగా ఉంటాయని అనుకుంటారు కానీ అవి పూర్తిగా ఆలోచించి తీసుకునే నిర్ణయాలు అనీ... కాగ్నిటివ్ పర్సనాలిటీ ఫంక్షనింగ్ ఇండెక్స్ అనేది ఈ వయసులో ఉన్నవారికే ఎక్కువగా ఉంటుందనీ ఈ అధ్యయనం పేర్కొంటోంది.



చుట్టూ అపారమైన జలరాశి ఉన్నా, ఒక్క చుక్కా వినియోగించుకోలేని పరిస్థితి వాళ్లది. అందుకే... నలభై ఏళ్లుగా రెండో పంటకు దూరమైన ఆ గిరిజన ప్రాంతాలు ఇప్పుడు సోలార్ లిఫ్ట్ ఇరిగేషన్, సోలార్ తోపుడుబళ్ల పుణ్యమాని అద్భుతాన్ని చూస్తున్నాయి. ఎన్నో గిరిజన గ్రామాల్లో స్ఫూర్తి నింపుతోన్న ఈ 'సోలార్ జలయజ్ఞం' గురించి తెలుసుకుందామా...

ఇది... 'సోలార్ జలయజ్ఞం'!



గిన్నెధరి... తెలంగాణాలోని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, తిర్యానీ మండలంలో ఉందీ అటవీప్రాంతం. ఏడాది పొడవునా నిండుగా పారే వాగులూ, వంకలతో- పాలధారల్లాంటి అద్భుతమైన జలపాతాలతో కన్నులపండుగ్గా ఉంటుందీ ప్రాంతం. ఇక్కడే కొన్నివేల ఎకరాలకు నీటిని అందించే కొర్లంక ప్రాజెక్ట్ కూడా ఉంది. ఇక్కడున్న మోహిందా, గిన్నెధరి, కొర్లంక, పాతగూడ, గుడిపేట, మర్కగూడ, సాలెగూడ వంటి గ్రామాలకు ప్రధాన ఆదాయ వనరు వ్యవసాయమే. నీరు సమృద్ధిగా ఉంది కాబట్టి ఆదాయానికి లోటుండదు అనుకుంటే మాత్రం పొరపాటే. ఇక్కడే ఉంది చిక్కంతా! చుట్టూ నీరున్నా, అందులోంచి చుక్క నీటిని కూడా వినియోగించుకోలేని దుస్థితి వీళ్లది. కారణం పొలాలు కొండపైన ఉంటే, వాగులు కింద ఉంటాయి. అందుకే ఒకే ఒక్క వర్షాధార పంట వేసుకుంటారు. అప్పుడు కూడా సమయానికి పంటకి తడి అందకపోతే నష్టపోవాల్సిందే! ఇక, రెండోపంట గురించిన ఆలోచనే ఉండదు. ఎందుకంటే... ఇక్కడ త్రీఫేజ్ కరెంట్ సదుపాయం ఉండదు. దాంతో కింద ఉన్న వాగుల నుంచి నీళ్ల పైకి తోడుకోవాలంటే డీజిల్, పెట్రోల్ జనరేటర్లపైనే ఆధారపడాలి. అది బోలెడు ఖర్చుతో కూడుకున్న పని. బావులూ, బోర్లూ ఉంటే ప్రభుత్వం కరెంట్ కనెక్షన్ ఇస్తుంది కానీ అవి మాటిమాటికీ మట్టితో పూడుకుపోతుంటాయి. పైగా అంతా చిన్న, సన్నకారు రైతులే. వీటిపైన వచ్చే అరకొర ఆదాయం కోసం ఇంత ఖర్చు పెట్టాలని ఎవరు అనుకుంటారు? అందుకే వాళ్లు 40ఏళ్లుగా రెండో పంట ఆలోచన చేయలేదు. రైతుల బాధని అర్థం చేసుకున్న 'వాసన్' స్వచ్ఛంద సంస్థ వాళ్ల రెండో పంట కలని నిజం చేయాలనుకుంది. ఈ సంస్థ పాతికేళ్లుగా దేశవ్యాప్తంగా నీటి యాజమాన్య పద్ధతులూ, సేంద్రియ వ్యవసాయంపైన పనిచేస్తూ రైతులకు అండగా నిలుస్తోంది. ఆ అనుభవంతోనే సుమారు 40 అడుగులు కింద ఉన్న నీటిని పైకి తీసుకురావడానికి భగీరథ ప్రయత్నమే చేసింది. కొండపైన ఎగుడుదిగుడుగా ఉండే పొలాల్లోకి నీటిని పారించాలంటే సోలార్ టెక్నాలజీనే సరైన మార్గం అని నమ్మారీ సంస్థ ప్రతినిధులు. నీటిని పైపుల ద్వారా పైకి తీసుకొచ్చేందుకు ప్రణాళిక రచించారు. ప్రతి యాభైమీటర్ల పరిధిలో ఈ పైపుల నుంచి నీళ్లు ఎగజిమ్మేలా స్ప్రింక్లర్లను ఏర్పాటు చేయాలనుకున్నారు. అంతా బాగుంది కానీ, ఈ పని చేయడానికి ఎకరాకి యాభైవేల రూపాయలపైనే ఖర్చు అవుతుంది. ఇదే విషయాన్ని వాసన్ సంస్థ ప్రతినిధులు ఎల్ఐసీ ఫైనాన్స్ సంస్థకు వివరించారు. రైతుల జీవితాల్లో వెలుగులు నింపే ఈ ఆలోచన బాగుండటంతో ఎల్ఐసీ ఫైనాన్స్ సుమారుగా రూ. రెండున్నరకోట్ల సీఎస్ఆర్ నిధులని 'సుజలాం' పేరుతో ఖర్చు పెట్టడానికి ముందుకొచ్చింది.

రైతుల శ్రమదానంతో...

నీరు ఉంది, దాన్నిపైకి తీసుకొచ్చే టెక్నాలజీ ఉంది, ఆ కలను నిజం చేయడానికి కావాల్సిన ఆర్థిక వనరులూ ఉన్నాయి... వీటన్నింటికీతోడు రైతుల భాగస్వామ్యం కూడా ఉంటేనే ఈ ప్రాజెక్ట్ విజయవంతం అవుతుందని భావించింది వాసన్. అయితే వారి భాగస్వామ్యం డబ్బు రూపంలో కాకుండా, శ్రమ రూపంలో ఉండేలా చేసింది. అదెలా అంటే... కింద నుంచి పైకి వేసే పైపులని రైతులే స్వయంగా వేసుకోవచ్చు, లేదా తోటి రైతుల సాయం తీసుకోవచ్చు. రెండో పంట వేయడం అంటే ఒక ఉద్యోగంతో వచ్చే ఆదాయంతో సమానం కాబట్టి రైతులూ ముందుకొచ్చి, సంఘాలుగా ఏర్పడ్డారు. వాసన్ సంస్థ ఇదే విధానాన్ని మరోవైపు అరకులో పైలట్ ప్రాజెక్టుగా చేయడంతో ఆ అనుభవంతోనే ఇక్కడి పనులు చకచకా పూర్తిచేసింది. అయితే ఇక్కడ వేసే రెండోపంట తప్పనిసరిగా ఆహారపంట లేదా ఆరుతడి పంటనే వేయాలన్న నిబంధన ఉంది. దాంతో పత్తి, కంది వంటి పంటలకి మాత్రమే పరిమితం అయిన రైతులు తృణధాన్యాలూ, బీరకాయ, సొరకాయ, బీట్‌రూట్, క్యారెట్, గోరుచిక్కుడు వంటివన్నీ పండిస్తున్నారు. ఇక్కడున్న సోలార్ ప్యానెల్స్ తక్కువ సూర్యరశ్మితో కూడా పనిచేస్తాయి. అలా గుడిపేట, మోహిందా, గడల్పలపల్లి, కొలాంగూడ వంటి 24 గ్రామాల్లోని ప్రజలు రెండో పంట వేసుకుంటూ ఆదాయాన్ని పెంచుకుంటున్నారు.

సోలార్ తోపుడు బళ్లతో మార్పు...

'ఈ ప్రాంతంలో వర్షాలు పుష్కలంగా ఉంటాయి. కొండపైన ఉన్న చిన్నచిన్న కుంటలు ఏడాదిలో పదినెలలపాటు నీటితో ఉంటాయి. ఆ నీటిని కూడా సద్వినియోగం చేసుకునేలా సోలార్ తోపుడుబళ్లని వీరికి అందుబాటులో ఉంచాం. వీటిని ఎక్కడికంటే అక్కడికి తేలిగ్గా తరలించవచ్చు. వాటికి మినీ పంప్‌సెట్లను అమర్చి పంటలకు కావాల్సిన నీళ్లు తోడుకోవచ్చు. మరోవైపు ఆ నీటికుంటల్లో చేపలనీ, ఇళ్ల దగ్గర నాటుకోళ్లనీ పెంచుకునేలా శిక్షణ ఇచ్చి ప్రతిరైతూ రూ. పాతికవేల వరకూ అదనపు ఆదాయం పొందేలా చూశాం' అంటున్నారు వాసన్ సంస్థ ప్రతినిధి లక్షణ్. ఐకమత్యంగా అడుగులు వేస్తూ మారిన ఈ గ్రామాల స్ఫూర్తితో మరికొన్ని గ్రామాలూ ఈ తరహా సాగువైపు ఆసక్తి చూపిస్తున్నాయి. బాగుంది కదూ ఈ జలయజ్ఞం.

సహకారం: నామని నవీన్, ఈనాడు డిజిటల్, ఆసిఫాబాద్



నగల మేళా!



అద్భుతమైన చెక్కుళ్లతో ఆకట్టుకునే దేవుళ్ల నగలు రంగుల్లో మెరిసిపోతున్నాయి. అమ్మాయి మెడలోని తాళి గొలుసులో గోపురం దర్శనమిస్తోంది. చిన్నదాని తీగలాంటి నడుముకు ముత్యాల సొబగులు అద్దుకున్నాయి. నేటి తరాన్ని మెప్పిస్తున్న ఆ నయా ఫ్యాషన్లు ఏంటో చూసేద్దాం పదండి!

బంగారానికి రంగుల మెరుపు!





పసిడి ధగధగల మీద రంగుల మెరుపులూ తీసుకొస్తే... ఆ ఆభరణం లుక్కు పూర్తిగా మారిపోదూ! ఆ విషయాన్ని గ్రహించే ఈ మధ్య బంగారు డిజైనర్లు- కలర్‌ఫుల్ జ్యువెలరీకి రూపమిస్తున్నారు. ఉంగరాలూ, లాకెట్లూ, నెక్లెసులూ... ఇలా రకరకాల నగల మీద రంగుల్నీ అద్దుతున్నారు. అయితే ఆభరణాల మీద రంగులు కనిపించడం అన్నది కొత్త విషయమేమీ కాదు. ఇదివరకే ఎనామిల్, మీనాకారి జ్యువెలరీ ఉండేది. అయితే నగ మీద అక్కడక్కడా మాత్రమే కనిపించే ఎనామిల్ కోట్- ఇప్పుడు నగ మొత్తం కనిపించేస్తోంది. పెరుగుతున్న బంగారం ధరలకు తగ్గట్టు పేపర్ క్యాస్టింగ్ పేరుతో లైట్ వెయిట్ జ్యువెలరీని తీసుకొస్తూ- ఆ ఆభరణం ఆకృతి కాంతులీనేలా రంగులు పూస్తున్నారన్నమాట. ఇదివరకు వేసే ఎనామిల్ కోట్ కాస్త ముద్దగా కనిపిస్తే... ఇది మాత్రం ఎంతో సహజంగా ఉంటుంది. దేవుళ్ల ఆకారమూ, అలంకరణా, దుస్తులకు తగ్గట్టు- కుంచెతో హ్యాండ్ పెయింటెడ్ రంగుల్ని పసిడి మీద అద్దుతున్నారు!



ముత్యాల వడ్డాణాలు!





వెన్నెల వన్నెల ముత్యాలంటే మగువలందరికీ ఇష్టమే! ఆ ఆసక్తే- వాటిని అమ్మాయి నడుము ఒంపుల్లోకి చేర్చింది. ఒకప్పుడు చెవి పోగులూ, ఉంగరాల్లో కనిపించిన ముత్యం- తర్వాత్తర్వాత చోకర్ల నుంచి వరుసల హారాల వరకూ అన్నింటా మెప్పించేసింది. ఇప్పుడేమో వడ్డాణాల్లోనూ కొత్త ఫ్యాషన్ అయిపోయింది. చీరతో ముస్తాబైన అమ్మాయి అలంకరణ మొత్తానికి ఫైనల్ టచ్ ఇచ్చేది వడ్డాణమే అంటూ ఈ బడ్జెట్ ఫ్రెండ్లీ వడ్డాణాలకు ఓటేస్తున్నారు. అటు ఫ్యాషన్ ఫాలో అయినట్టూ ఉంటుంది, ఇటు బంగారు ఆభరణం లోటు తీరినట్టూ ఉంటుంది కదా!



తాళిలో గోపురం!



ఏదో ఒక గొలుసుతో మంగళసూత్రం వేసుకునే పద్ధతి ఎప్పుడో పోయింది. వేడుకల్లో మాత్రమే ధరించే నగల్లోనే ఎంతో కొత్తదనం కోరుకుంటుంటే- మరి రోజూ మెడలో ఉండే ఆభరణం ఇంకెంత ప్రత్యేకంగా ఉండాలి అనుకుంటూ చాలాకాలం నుంచే అతివలు సైడ్ పెండెంట్ చెయిన్లను ఎంచుకోవడం మొదలుపెట్టారు. తమిళనాడు సంప్రదాయంలో ముగప్పు చెయిన్లుగా పిలిచే ఈ గొలుసుల్లో ఎప్పటికప్పుడు వెరైటీలు వస్తూనే ఉన్నాయి. అభిరుచికి తగ్గట్టు మెప్పించేలా లక్ష్మీదేవీ, వేంకటేశ్వరస్వామీ, రాధాకృష్ణులూ, సీతారాములూ... ఇలా ఇష్టదైవాల విగ్రహాలొచ్చాయి. ఇంకా నెమళ్లూ, చిలుకలూ, ఆకులూ, పువ్వుల డిజైన్లూ అలరించాయి. ఇప్పుడేమో ఇంకాస్త ఆకర్షించేలా ఆలయ గోపురాలతో కూడిన దేవుళ్ల పెండెంట్లనూ ఈ తాళి చెయిన్లలో తీసుకొస్తున్నారు. మెడలోనే గుడి కట్టేసినట్టు ఉండే ఈ సైడ్ పెండెంట్‌తో ఉన్న గొలుసు ఒక్కటి వేసుకున్నా చాలు, ఎంతో నిండుదనం వచ్చేస్తుంది. అంతేకాదు, చూసే వాళ్ల కళ్లు కచ్చితంగా ఆ టెంపుల్ పెండెంట్ మీదకే వెళతాయంటే నమ్మండి!





నలభై, యాభై, అరవై... వయసు ఎంతైనా కావచ్చు. మన లోలోపల ఓ పసివాడు ఉంటాడు. మనం దారితప్పినప్పుడు గుర్తుచేస్తుంటాడు. మనల్ని అహాలు చుట్టుముట్టినప్పుడు హెచ్చరిస్తుంటాడు. మనలో ఆనందాన్నీ ఆత్మవిశ్వాసాన్నీ ప్రోత్సహిస్తుంటాడు. ఆ చిన్నారి మన గతానికి ప్రతినిధి. తనెప్పుడూ చిన్నబుచ్చకూడదు, తిట్టిపోయకూడదు. ప్రామిస్!



ప్రతివారిలో... ఓ పసిబిడ్డ!

చిన్నపిల్లల్ని చూడగానే... అమాంతంగా దగ్గరికి తీసుకోవాలనిపిస్తుంది, ఆ పాలబుగ్గల్ని సుతారంగా నిమరాలనిపిస్తుంది, ఆ చిన్నిచిన్ని చేతులతో కాసేపు ఆడుకోవాలనిపిస్తుంది, ఆ బంగారు పాదాల్ని ప్రేమగా ముద్దాడాలనిపిస్తుంది, అవకాశం దొరికితే, బుజ్జాయిని భుజాల మీద ఎక్కించుకుని ఊరంతా చుట్టేయాలనిపిస్తుంది.

...ఆ పరవశానికి కారణం, మన లోలోపల ఉన్న పసివాడే! అప్పటి వరకూ గురకపెట్టి నిద్రపోతున్నవాడు కాస్తా... ఆ బోసినవ్వుల సందడికీ, బుడిబుడి అడుగుల సవ్వడికీ ఎవరో తట్టిలేపినట్టు, కళ్లు నులుపుకుంటూ లేచి కూర్చుంటాడు. చిన్నారితో మన ముచ్చట్లను మురిపెంగా ఆస్వాదిస్తాడు. అదీ కాసేపే. అంతలోనే, చుట్టాలో స్నేహితులో తారసపడతారు. లోకాభిరామాయణం మొదలుపెడతారు. బంగారం ధరల హెచ్చుతగ్గులూ, తెలుగు సినిమాల జయాపజయాలూ, రాజకీయ పార్టీల వ్యూహప్రతివ్యూహాలూ... ఏదో ఒకటి చర్చించుకుంటూ కూర్చుంటాం. తనను పట్టించుకోవడం లేదని అర్థమైపోగానే... చిన్నారి బిక్కమొహం వేస్తుంది. అమ్మ కావాలంటూ ఏడ్చేస్తుంది. ఇక రమ్మన్నా రాదు. ఆ కాలక్షేపం కబుర్లు నచ్చక, మనలోని పసివాడు కూడా మొహం తిప్పుకుంటాడు. మళ్లీ లేత పువ్వులో, పసి నవ్వులో మేల్కొలిపే వరకూ సుషుప్త స్థితిలోనే ఉండిపోతాడు.

అవును, ప్రతి మనిషిలోనూ ఓ పసిబిడ్డ ఉంటాడు. తను మన బాల్యానికి ప్రతినిధి. మన 'సబ్‌కాన్షియస్ మైండ్'లోని చిన్నప్పటి జ్ఞాపకాలకూ అనుభవాలకూ సంరక్షకుడు. మనం ఎప్పుడూ పసితనంలోని ఆనందాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ, ఆశావాదాన్నీ అంటిపెట్టుకుని ఉండాలని కోరుకునే శ్రేయోభిలాషి. ఈ 'ఇన్నర్ చైల్డ్' భావనను మానసిక శాస్త్రం కూడా ఆమోదిస్తోంది. ప్రశాంతంగా కళ్లు మూసుకుని చిన్నప్పటి జ్ఞాపకాల్లోకి వెళ్లిపోయినప్పుడు, మనసు తెర మీద మెరిసే మనదైన పసి రూపమే... 'ఇన్నర్ చైల్డ్'.

పట్టించుకోరూ!

పసిపిల్లలు మహర్జాతకులు. తమ ఇంటికి తామే సెలెబ్రిటీలు! అమ్మ సీమంతం... బిడ్డ స్వాగత సంరంభానికి శ్రీకారం. బారసాల వేడుకంతా బాలాకుమారుడి చుట్టే తిరుగుతుంది. నామకరణోత్సవం నాడు, కొత్త సినిమా టైటిల్ రిలీజ్ ఈవెంట్‌ను తలపించేంత సందడి. అన్నప్రాశన రోజున తీయతీయని పాయసం చుక్కల్ని చప్పరిస్తున్నప్పుడు బుజ్జాయి తన్మయత్వాన్ని చూడాల్సిందే. అక్షరాభ్యాసం సమయంలో అందరి కళ్లూ... చిట్టి చేతులు అందుకునే కొత్త వస్తువు మీదే! తర్వాత, ఓ సుదీర్ఘ విరామం. పంచెకట్టు ఫంక్షన్ సమయానికి ఆ బాలుడు... అటు బాల్యమూ, ఇటు యవ్వనమూ కాని వింత దశకు చేరుకుని ఉంటాడు. ఇక అప్పటి నుంచీ హెచ్చరికలు మొదలవుతాయి. 'పెద్దవాడివి అవుతున్నావు... పిల్లల్లా గెంతకూడదు, పిల్లల్లా ఏడ్వకూడదు, పిల్లల్లా నవ్వకూడదు, పిల్లల్లా మాట్లాడకూడదు. అర్థమైందా? అర్థమైందా? అర్థమైందా?...' అంటూ ఒకటికి పదిసార్లు గుర్తుచేస్తుంటారు. నాన్నలూ, బాబాయిలూ, మావయ్యలూ ఎప్పుడూ మొహం వేలాడేసుకునే ఉంటారు కాబట్టి... పెద్దరికం అంటే అలా ఉండటమే కాబోలని అనుకుంటాడు. అంతలోనే ఐఐటీ పరుగులూ, క్యాంపస్ ప్లేస్‌మెంట్లూ, ఇన్‌స్టంట్ ప్రేమలూ, డెస్టినేషన్ వివాహాలూ... ఒకదాని వెంట ఒకటి తరుముకొస్తాయి. ఆ పరుగులో పడిపోయి... తన లోలోపలి పసివాడిని పట్టించుకోవడం మానేస్తాడు. దీంతో, ఆ ఇన్నర్ చైల్డ్ అలకపాన్పు ఎక్కేస్తాడు. మాట్లాడటం ఆపేస్తాడు. ఎవరూ ఆ సంగతే గుర్తించరు. తర్వాత ఎప్పుడో ఆ లోటు తెలుస్తుంది. ఎంత విలువైన బంధాన్ని కోల్పోయామో అర్థం అవుతుంది.

'వ్యాస రచన పోటీలో ఎవరు పాల్గొంటారు?' అని అడగడమే ఆలస్యం. మన చెయ్యే ముందుగా పైకి లేచేదే! ఇప్పుడు, 'సింగపూర్ ప్రాజెక్ట్‌ను ఎవరు లీడ్ చేస్తారు?' అని బాస్ ఒకటికి రెండుసార్లు రెట్టించినా, అసలు స్పందించమెందుకూ! ఆ ఆత్మవిశ్వాసం ఏమైపోయిందీ! 'ఎనీ డౌట్స్?'... క్లాస్ టీచర్ ప్రకటించడమే తరువాయి, వరుస సందేహాలతో ఉక్కిరిబిక్కిరి చేసేవారే! ఇప్పుడు, బుర్రనిండా అనుమానాలు ఉన్నా, టీమ్‌లీడర్‌ను అడగడానికి కూడా ధైర్యం చాలదెందుకూ! ఈ ఆత్మన్యూనత ఎక్కడి నుంచి వచ్చిందీ!

అప్పట్లో లంచ్‌బాక్స్ అంటే అక్షయపాత్రే. పది చేతులు మారేది. మొహమాటంతో ఎవరైనా వద్దని చెప్పినా, ముద్దచేసి మరీ నోట్లో పెట్టేవారే! ఇప్పుడు, కూడలి దగ్గర ముసలి యాచకుడికి పర్సులోంచి పది రూపాయలు తీసివ్వడానికి కూడా సందేహిస్తారెందుకూ? మనసు ఇంత కఠినంగా ఎలా మారిందీ!

...ఒకటే సమాధానం. మనకు మనం దూరమైపోవడం. మనం అంటే... బాల్యంలోని మనమే! ఆ అమాయకత్వమే, ఆ నిర్భయత్వమే, ఆ స్వేచ్ఛాప్రియత్వమే, ఆ సహానుభూతే! ఆ లంకె తెగిపోతే, మనకు మనమే అపరిచితులం అవుతాం. మందలో గొర్రెలా మిగిలిపోతాం. టీవీలో క్రికెటర్లు ఎండార్స్ చేసిందే అసలైన ఆనందమని భ్రమిస్తాం. సెల్ఫ్‌హెల్ప్ పుస్తకాల్లోని తూకంరాళ్లతో మనల్ని మనం కొలుచుకుని



సంతృప్తి చెందుతాం. మంచి కుటుంబం, లక్షణమైన ఉద్యోగం, లక్షల జీతం... దేనికీ కొరత ఉండదు. పైపైకి అంతా బావున్నట్టే అనిపిస్తుంది. మనసు లోతుల్లో మాత్రం తీవ్ర అసంతృప్తి. మనం కోరుకున్న జీవితం ఇది కానేకాదని, ఓ పక్కన అర్థమైపోతూ ఉంటుంది.

మనమేమిటో, మన ఇష్టాలేమిటో... మనలోని పసివాడికే బాగా తెలుస్తుంది. ఇన్నర్ చైల్డ్ నోరు కట్టేయడం వల్ల వచ్చిన సమస్యే ఇది. తక్షణం వాణ్ని నిద్రలేపాలి. గడ్డం పట్టుకుని బతిమాలాలి. ఆరు నూరైనా అలక మాన్పించాలి. 'ఒట్టు, ఇంకెప్పుడూ నిన్ను బాధపెట్టను' అని మాటిచ్చి మరీ వెనక్కి తెచ్చుకోవాలి. వాడికి నచ్చే పనులు చేయాలి. సొంతూరి ముచ్చట్లు వినిపించాలి. బాల్య స్నేహితులతో బాతాఖానీ పెట్టించాలి. ఇలా, రకరకాల మార్గాల్లో మన లోలోపలి పసివాడితో పాత అనుబంధాన్ని పునరుద్ధరించుకునే ప్రయత్నాన్నే మానసిక నిపుణులు 'రీపేరెంటింగ్' అంటారు. అంటే, మనలోని పసివాడికి మనమే అమ్మానాన్నలుగా మారడం అన్నమాట!

జ్ఞాపకాల బండెక్కి...

పిల్లల్ని మనవైపు తిప్పుకోవడం మహా సులభం. ఇష్టమైన వస్తువుల్ని ఆశ చూపితే చాలు, పరుగుపరుగున వచ్చేస్తారు. ప్రేమగా ఒళ్లో వాలిపోతారు. మనలోని పసివాడికి సంబంధించినంత వరకూ... బాల్య జ్ఞాపకాలే చాక్లెట్లూ బిస్కెట్లూ! అప్పుడప్పుడూ సమోసాలూ పాప్‌కార్న్‌లూ, ఈలలూ గోలలూ కూడా! సినిమా అనేది... చిన్నప్పటి మాయా ప్రపంచం, 70 ఎంఎం తెరపైన మెరిసే రంగుల జ్ఞాపకం. మన అభిమాన హీరో బొమ్మల్ని ఎప్పుడు, ఏ థియేటర్‌లో, ఎవరితో కలిసి చూశామన్నది కూడా ఠక్కున చెప్పేయగలం. అవే సినిమాలకు మరోసారి వెళ్లే అవకాశం వస్తే.... స్క్రీన్ మీద సెన్సార్ సర్టిఫికెట్ పడక ముందే బాల్యంలోకి జారిపోతాం. 'షోలే' నుంచి 'శివ' వరకూ సమస్త 'రీ రిలీజ్' సినిమాల మహారాజ పోషకుడు ఇన్నర్ చైల్డే! చూసిన సినిమానే చూస్తూ, విన్న సంభాషణలే వింటూ, పాడుకున్న పాటలే పాడుకుంటూ... బాల్య స్నేహితులతో కలిసి పాత జ్ఞాపకాల్లోకి వెళ్లిపోవడం ఏ సింగపూర్ ట్రిప్పూ ఇవ్వనంత పునరుత్తేజం. మనలోని పసివాడికైతే అదో అనుబంధాల పండగే! పూర్వ విద్యార్థుల సమావేశాలు కూడా లోలోపలి పిల్లాడికి తెగ నచ్చే సందర్భాలు. నిజానికి, వాడు పట్టుపట్టబట్టే మనం ఎక్కడెక్కడి నుంచో రెక్కలు కట్టుకుని మరీ సొంతూరి బడి ఒడిలో వాలిపోతాం. 'ఏరా!' అన్న పిలుపులూ, 'ఒరే!' అన్న పలకరింపులూ... కృతకమైన కార్పొరేట్ ఎటికెట్‌కు అలవాటు పడిపోయిన మనిషిని చొరవగా చొక్కాపట్టుకుని... నేల మీదికి లాక్కొస్తాయి. ఆ సందడిని మనలోని బాలుడు ఇష్టంగా ఆస్వాదిస్తాడు.

మాట్లాడుకుందాం...రా!

'డాక్టర్ గారూ! నేను చాలా హెల్ప్‌లైన్లకు ఫోన్ చేశాను, ఆన్‌లైన్‌లో ఎంతోమందితో మాట్లాడాను. నేరుగా వెళ్లి మీ లాంటి వారినీ సంప్రదించాను. అయినా, నాలోని భయాలు పోలేదు. ఆత్మహత్య ఆలోచనలు ఆగలేదు...' అంటూ అమెరికన్ ఇంగ్లిష్ ఉచ్చారణలో ఇంకేదో చెప్పబోయాడు న్యూజెర్సీలో స్థిరపడిన తెలుగు ఐటీ ఉద్యోగి. ఆ మాటల్ని మధ్యలోనే తుంచేస్తూ... 'మీ ఊళ్లోని బాల్య స్నేహితుడితో ఒక్కసారైనా మాట్లాడారా?' అని ఎదురు ప్రశ్న వేశాడు మానసిక వైద్యుడు. నిజమే, మనం ఎన్ని దేశాలు తిరిగినా, ఎన్ని విద్యలు నేర్చుకున్నా... మాతృభాషలోనే సౌకర్యవంతంగా సంభాషిస్తాం. చిన్నప్పటి నేస్తాల ముందే మనసు విప్పుతాం. అందులోనూ మనదే అయిన మాండలికాన్ని మరింత ఇష్టపడతాం. ఆ యాసలో ఎవరైనా

చిన్నారీ... క్షేమమా?

మీలోని పసివాడు నిద్రపోతున్నాడా, నిద్ర నటిస్తున్నాడా, లేదంటే ఇప్పటికే మేల్కొన్నాడా? ఈ ప్రశ్నకు జవాబు తెలియాలంటే, మిమ్మల్ని మీరు బేరీజు వేసుకోవాలి.

1. నా మనసులోని భావాలను స్పష్టంగా, ధైర్యంగా ఇతరులతో పంచుకోగలను.
2. ఏ విషయమైనా కావచ్చు, నాకు అసౌకర్యంగా అనిపిస్తే 'కాదు... లేదు' అని చెప్పడానికి సందేహించను.
3. నా చుట్టూ ఓ లక్ష్మణరేఖ గీసుకుంటాను, ఇతరుల సరిహద్దుల్నీ గౌరవిస్తాను.
4. ఆత్మవంచనతో ఎవర్నో సంతృప్తి పరచడం కంటే, నేను ఆనందంగా ఉండటమే ముఖ్యమని భావిస్తాను.
5. అవసరమైతే ఇతరులతో విభేదించడానికి వెనకాడను. మంచివాడనే ముసుగు నాకు అవసరం లేదు.
6. నా కోపతాపాలకూ, ఆనంద విషాదాలకూ నేనే బాధ్యుణ్ని. ఎవరి వైపూ వేలెత్తి చూపను.
7. అవసరమైతే, మొహమాటపడకుండా ఇగోలకు పోకుండా ఇతరుల్ని సాయం అడుగుతాను.
8. వర్తమానంలో జీవిస్తాను. వర్తమానాన్నే ఆస్వాదిస్తాను.
9. ఎవరి కోసమో నా గమ్యాన్ని మార్చుకోకుండా, నేను ఎంచుకున్న దార్లోనే వెళ్తాను.
10. నా పట్ల నాకు పరిపూర్ణమైన నమ్మకం ఉంది.



సమాధానాలు

ఎ. ఎల్లప్పుడూ, బి. అప్పుడప్పుడూ, సి. ఎప్పుడో ఒకసారి. డి. దాదాపుగా లేదు.

మార్కులు: ఎ-3, బి-2, సి-1, డి-0.

విశ్లేషణ

25-30 మీలోని పసివాడు చురుగ్గా ఉన్నాడు. బాల్యంలోని ఆనందానికీ, ఆత్మవిశ్వాసానికీ చేరువలో ఉన్నారు.

15-24 మీలోని పసివాడు కొన్నిసార్లు స్పందిస్తాడు, కొన్నిసార్లు స్పందించడు. గుండె లోతుల్లో ఇంకా మిగిలిపోయిన అహాల్ని క్రమంగా వదిలించుకోండి.

0-14 మీలోని పసివాడికి మీమీద ఇంకా నమ్మకం కలగడం లేదు. తనను దారికి తెచ్చుకునే ప్రయత్నం చేయండి.

పలకరిస్తే సంబరపడిపోతాం. ఆ మాటలు నేరుగా మనసును తాకుతాయి. జర్మనీలోని టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ మ్యూనిచ్‌కు చెందిన నిపుణుల అధ్యయనం కూడా ఇదే మాట చెప్పింది. మనవాడు అనుకునే మనిషితో, మనదైన మాండలికంలో మాట్లాడుతున్నప్పుడు, అటువైపున ఉన్నది అతి సామాన్యుడైనా, ఆ మాటలు సైకోథెరపీ అంత శక్తిమంతంగా పనిచేస్తాయట. 'ఏంటా పిచ్చి ఆలోచనలూ! నీ గురించి మన ఊళ్లో ఎంత గొప్పగా చెప్పుకుంటామో తెలుసా? అయినా... పట్టుమని పదేళ్లు కూడా నిండకుండానే అమ్మానాన్నల్ని పోగొట్టుకున్నప్పుడూ, ఎవరో ఇచ్చిన పాత పుస్తకాలతో వీధిబడిలో చదువుకున్నప్పుడూ, చిరుగుల చొక్కాతో ఒళ్లు దాచుకున్నప్పుడూ, వారాలు చేసుకుని కడుపు నింపుకున్నప్పుడూ లేని భయం ఇప్పుడెందుకొచ్చిందిరా!' అంటూ బాల్య స్నేహితుడు గుండె ధైర్యం నింపడంతో ఆ ప్రవాసుడు నెగెటివ్ ఆలోచనల నుంచి బయటపడ్డాడు. ఆ మార్పును చూసి లోలోపలి వాడూ సంతోషించాడు.

బాల్యంలో ఆడుకున్న ఆటలు ఇన్నర్‌చైల్డ్‌ను భలేగా మురిపిస్తాయి. సహజంగానే, మైదానంలోకి వెళ్లగానే మనసుకు వేసుకున్న ముసుగులన్నీ తీసేస్తాం. వయసును ఒడ్డున పెట్టేస్తాం. ఆ కాసేపూ ఆటగాడి పాత్రలో లీనమైపోతాం. అరుస్తాం, గెంతుతాం, పరిగెత్తుతాం, కేరింతలు కొడతాం, డ్యాన్సులు చేస్తాం... అచ్చంగా చిన్నప్పట్లానే! పిల్లల మధ్య ఉన్నప్పుడూ అంతే. ప్రపంచాన్నే మరిచిపోతాం. మనమూ పిల్లలమైపోతాం. వాళ్లతో ఓ ఐదు నిమిషాలు మాట్లాడినా... రోజంతా గులాబీ తోటలో విహరించినంత ఆహ్లాదకరమైన అనుభూతి సొంతం అవుతుంది. కాకపోతే, ఓ షరతు. ఆ కాసేపూ మనలోని పెద్దరికాన్ని కట్టిపెట్టాలి. పాండిత్యాన్నీ, పట్టాలనూ అటకెక్కించాలి. లేని ఆశ్చర్యాన్ని జోడిస్తూ వాళ్లు చెప్పేదంతా శ్రద్ధగా వినాలి. మనసారా నవ్వాలి. వాళ్లనూ నవ్వించాలి. ఆ సందడిని చూసి, మనలోని పసివాడు కూడా ఫక్కున నవ్వేస్తాడు. మనకు కావలసిందీ అదే! వీలైతే, గుర్తొచ్చినవి గుర్తొచ్చినట్టు బాల్య జ్ఞాపకాలన్నీ ఓ పుస్తకంలో రాసేసుకోండి. బంధుమిత్రుల్ని అడిగి పాత ఫొటోలు సేకరించండి. అలనాటి నేస్తాలకు ఫోన్లు చేయండి. ఏ కారణంతోనో ఆగిపోయిన చిన్నప్పటి అభిరుచుల్ని మళ్లీ కొనసాగించండి. అప్పటి కలలేమైనా మిగిలిపోయి ఉంటే నిజం చేసుకోండి. ఓ రెండ్రోజులు సెలవుపెట్టి సొంతూరికి వెళ్లిరండి. ఇలా, చిత్తశుద్ధితో మీరు చేసే ప్రతి ప్రయత్నమూ లోలోపలి పసివాణ్ని మరింత దగ్గర చేస్తుంది.



మనసుకూ చికిత్స...

ఎవరి బాల్యంలో అయినా, అన్నీ తీపి జ్ఞాపకాలే ఉండవు. ఎన్నో కొన్ని చేదు అనుభవాలూ ఉంటాయి. భౌతిక దాడులూ, లైంగిక హింసలూ, ప్రేమరాహిత్యాలూ, ఆత్మీయుల మరణాలూ, కన్నవారి గొడవలూ... ఏదో ఓ దశలో కలవరానికి గురిచేసి ఉంటాయి. మనలోని పసివాడు, ఆ అఘాతం నుంచి ఇంకా తేరుకుని ఉండకపోవచ్చు. ఆ జాడలు నీడల్లా వెంటాడుతూ ఉండొచ్చు. అవన్నీ ఆలోచనల్ని ప్రభావితం చేస్తాయి. ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. సానుకూల దృక్పథాన్ని చంపేస్తాయి. చిన్న విమర్శను కూడా తట్టుకోలేక పోతున్నామంటే, బాల్యంలో ఎవరో మన భావాల్ని తీవ్రంగా గాయపరిచి ఉంటారని అర్థం. కొత్తవారితో మాట్లాడటానికి జంకుతున్నామంటే, ఏ అపరిచితుడో అప్పట్లో భయపెట్టి ఉంటాడని భావం. అంతేకాదు, విచ్ఛిన్నమైన కుటుంబాల్లో పెరిగిన పిల్లలకు వివాహ వ్యవస్థ పట్ల పెద్దగా నమ్మకం ఉండదు. పెళ్లి చేసుకున్నా... సంతోషంగా ఉండలేరు, జీవిత భాగస్వామితో సర్దుకుపోలేరు. కటిక పేదరికాన్ని అనుభవించిన వారిలో అభద్రత ఎక్కువ. ఏ చిన్న రిస్కు తీసుకోడానికీ ఇష్టపడరు. వ్యసనాలూ, అబద్ధాలూ, అప్పులూ, మోసాలూ... ఇలా సగానికి సగం వ్యక్తిత్వ లోపాలకు బాల్యంలోని చేదు అనుభవాలే కారణమంటారు మానసిక శాస్త్రవేత్తలు. ఇవన్నీ మన వ్యక్తిగత, వృత్తిగత జీవితాల్లో సంక్షోభాల్ని సృష్టిస్తాయి. వెంటనే, ఆ గాయాల మూలాలను గుర్తించాలి. మనసుకు మందు పూసి చికిత్స చేసుకోవాలి. అలాంటి దురదృష్టకర పరిణామాలు పునరావృతం కావంటూ మనలోని పసివాడికి ధైర్యం చెప్పాలి. 'నేనున్నా...' అనే భరోసా ఇవ్వాలి. ఇలాంటి విషయాల్లో మానసిక వైద్యులు సూచించే పరిష్కారం... ఫర్‌గెట్ ఆర్ ఫర్‌గివ్! వీలైతే మరిచిపోవడం, కుదరకపోతే క్షమించేయడం! నిజమే, ఎంతకాలమని ఆ చెత్త మూటను మనలోని పసివాడి నెత్తిన రుద్దుతాం పాపం!

కొత్త జీవితం...

మన ప్రేమకు మురిసిపోయీ, మన సంరక్షణకు పొంగిపోయీ లోలోపలి పసివాడు నిద్రమత్తును వదిలేస్తే, ఇక తిరుగే ఉండదు. ఆ గడుగ్గాయి మన ఆలోచనా విధానాన్నే మార్చేస్తాడు. ఆనందానికి కొత్త అర్థం చెబుతాడు. ధైర్యంగా జీవించడం అలవాటు చేస్తాడు. స్వచ్ఛంగా నవ్వడం నేర్పుతాడు. సృజనాత్మకంగా ఆలోచించడం బోధిస్తాడు. బాల్యంలో మనం అచ్చంగా వర్తమానంలోనే జీవిస్తాం. గతం బాధపెట్టదు. భవిష్యత్తు భయపెట్టదు. అందుకే, మనకు ఇష్టమైందే చేస్తాం. ఇష్టం వచ్చినట్టుగానే ఉంటాం. మరొకరితో పోల్చుకోం. ఎవర్నీ అనుకరించం. ఆ స్వతంత్ర దృక్పథం మళ్లీ మన సొంతం అవుతుంది. అనగనగా ఓ కుబేరుడు. అతనికో అబ్బాయి. ఇంకా మాటలు సరిగా రాలేదు. ఓరోజు హెలికాప్టర్ కావాలంటూ ఏడుపు మొదలుపెట్టాడు. దీంతో, ఆ తండ్రి ఖరీదైన అద్దె హెలికాప్టర్‌ను తెప్పించి... అందులో షికారుకు తీసుకెళ్లాడు. అయినా, బిడ్డ ఏడుపు మానలేదు. అంతలోనే 'బొమ్మలూ.. బొమ్మలూ' అంటూ ఓ వీధి వ్యాపారి సంపన్నుడి భవంతి ముందు నుంచీ వెళ్తున్నాడు. అది చూసిన పిల్లాడు... బండి వైపు వేలు చూపించాడు. దగ్గరికి చేరుకోగానే అందులోని ఓ ప్లాస్టిక్ హెలికాప్టర్ బొమ్మను తీసేసుకుని... ఏడుపు ఆపేశాడు. ఆటలో మునిగిపోయాడు. అసలైన హెలికాప్టర్ ఖరీదైందే కావచ్చు. కానీ, బొమ్మ హెలికాప్టరే వాడికి నచ్చింది. ఆనందం, ఆత్మసంతృప్తి విషయంలో ఎవరి కొలమానాలు వారికి ఉంటాయి. మరొకరి కళ్లతో మనల్ని కొలుచుకోవడం... ఆత్మవంచనే! బాల్యం ఎప్పటికీ ఆ తప్పు చేయనివ్వదు.

★ ★ ★

సముద్రంలో పడిపోయిన ఉప్పు సంచి, కాసేపటికే పూర్తిగా కరిగిపోతుంది. తన ఉనికిని కోల్పోయి... సముద్రంలో భాగమైపోతుంది. అలాగే, నిన్న మొన్నటి వరకూ బుంగమూతి పెట్టుకుని మనసులో ఓ మూలన కూర్చున్న పసివాడు... మనం ఇష్టపడే కొద్దీ, ధైర్యం చెప్పే కొద్దీ మనకు మరింత చేరువ అవుతాడు. ఉప్పు సంచి సంద్రంలో కలిసిపోయినట్టు, తానూ మనలో ఐక్యం అవుతాడు. ఇక మనమే పాపాయీ, పాపాయే మనమూ. నిత్యం బాల్యమే, నిరంతరం ఆనందమే! ★

పాఠశాల స్థాయినుంచే...

అటు చదువు, ఇటు సేవ!



కొత్తతరం- ఇన్‌స్టా రీల్స్‌కీ యూట్యూబ్ షార్ట్స్‌కీ ఏఐ టూల్స్‌కీ అతుక్కుపోతున్నారు. 'నేను, నాది, అన్నింటా నేనే గెలిచి తీరాలి' అన్న నైజం వాళ్లలో పెచ్చుమీరుతోంది... గెలవకపోతే న్యూనతతో కుంగిపోతున్నారు. కానీ యువతకి సంబంధించిన అన్ని వాస్తవాలూ ఇలానే లేవు. వాళ్లపట్ల కొత్తనమ్మకాన్నిచ్చే సందర్భాలూ కనిపిస్తూనే ఉన్నాయి. కేరళలోనైతే అది వీధివీధినా కనిపిస్తోంది! అక్కడి యువత వ్యాధిగ్రస్థుల్నీ ఒంటరి వృద్ధుల్నీ కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. 'పాలియేటివ్ కేర్'కి సరికొత్త ఊపూ ఉత్సాహాలనిస్తోంది!





'ఆశా ఆంటీ... మనం సినిమాకి వెళదామా?!' అని అడిగింది ఫాతిమా. ఆ మాటలకి విస్తుపోయింది ఆశా. గత 15 ఏళ్ల కాలంలో తనని ఎవరూ అలా అడిగింది లేదు. ఎందుకంటే డాక్టర్‌లకి తను కేవలం ఓ పారాప్లెజిక్... నడుము కింది భాగం పనిచేయని పేషెంట్ మాత్రమే. చుట్టూ ఉన్నవాళ్లకి నిత్యం జాలిచూపాల్సిన జీవి. వృద్ధురాలైన తల్లికి తీరని మనోవేదనగా మారిన తనయ... అంతే! పదిహేనేళ్లకిందట ట్రైన్ ఎక్కుతుండగా పట్టుతప్పి పడిపోయిన ఆశాకు వెన్నెముక దెబ్బతింది. అప్పటి నుంచీ వీల్‌చైర్‌కే పరిమితమై తల్లిపైనే ఆధారపడుతోంది. అలాంటి ఆశాని సినిమాకి రమ్మని ఎవరు అడుగుతారు... నిత్యం చైతన్యంతో తొణికిసలాడే, చెలిమితో తనని ముంచెత్తే 19 ఏళ్ల ఫాతిమా తప్ప! ఫాతిమా 'పాలియేటివ్ కేర్' వలంటీరుగా గత మూడునెలలుగా వాళ్లింటికి వస్తోంది. డైపర్‌లు మార్చడం, ఇల్లు శుభ్రం చేయడం, వైద్యుల్ని అడిగి మందులు తెచ్చివ్వడం, ఫిజియోథెరపిస్టుల్ని అరేంజ్ చేయడం, అవసరమైతే ఆసుపత్రికి తీసుకెళ్లడం... ఇవన్నీ తనే చేస్తుంది. అవన్నీ ఒకెత్తు. ఆశాకి బోలెడు కబుర్లు చెప్పి ఆత్మీయత పంచడం ఒకెత్తు. ఆ కబుర్లలో భాగంగానే సినిమాకి వెళదామా అని అడిగింది ఫాతిమా. అడగడమే కాదు... తన ఫ్రెండ్స్ సాయంతో థియేటర్‌కి తీసుకెళ్లి... చేతులతో మోసుకెళ్లి మరీ సీట్లో కూర్చోబెట్టింది. ఆ మధ్య తమ కాలేజీ ఫెస్టివల్‌కీ తీసుకెళ్లి... ఆటపాటలతో అలరించింది!

- కేరళలో 'పాలియేటివ్ కేర్' వలంటీర్లుగా యువత అందిస్తున్న సేవలకి ఫాతిమా ఓ ఉదాహరణ. అలాంటి 15 వేలమంది యువతీయువకులు- లక్షలమంది వ్యాధిగ్రస్థులకి సేవలందిస్తున్నారు అక్కడ. మన దగ్గర ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాలున్నట్టే కేరళలో పాఠశాల స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయుల దాకా పాలియేటివ్ కేర్ క్లబ్బులు పనిచేస్తున్నాయి. తొమ్మిదో తరగతి నుంచే పిల్లలకి వీటిపైన శిక్షణ అందిస్తున్నారు... కాలేజీ స్థాయికి వచ్చేసరికి వాళ్లని అటు మెడికల్ అసిస్టెంట్‌లుగానూ ఇటు సైకలాజికల్ కౌన్సెలర్‌లుగానూ సుశిక్షితుల్ని చేస్తున్నారు. 15 ఏళ్ల కిందట చిన్నగా మొదలైన ఈ ఒరవడి... నేడు కేరళలోని అన్ని పంచాయతీలకూ విస్తరించింది. అక్కడ ప్రతి వీధికీ ఓ యువ పాలియేటివ్ కేర్ వలంటీర్ ఉన్నాడంటే... అతిశయోక్తి కాదు.

ప్రపంచానికి దారిచూపారు...

మరణపుటంచుల్లో ఉన్న తీవ్ర వ్యాధిగ్రస్థులు... శారీరకంగా ఎక్కువ బాధలు అనుభవించకుండా ఓ ఆహ్లాదకర వాతావరణంలో కన్నుమూయాలని... 1967లో ఇంగ్లాండ్‌లో మొదటి పాలియేటివ్ కేర్(హాస్పిస్) ప్రారంభమైంది. అక్కడ పనిచేసిన డాక్టర్ రాజగోపాల్... ఆ స్ఫూర్తిని పల్లెపల్లెకీ తీసుకెళితేనే ప్రజలకి మేలు జరుగుతుందని భావించాడు. కేరళలోని గ్రామాలకి వెళ్లి... అక్కడి వలంటీర్స్‌కి దీనిపైన ప్రత్యేక శిక్షణ అందించి... ప్రతి పంచాయతీకీ ఓ 'పాలియేటివ్ కేర్ సెంటర్'ని పెట్టాడు. వీటన్నింటికీ ప్రధాన కేంద్రంగా 1993లో కోళిక్కోడులో 'పెయిన్ అండ్ పాలియేటివ్ కేర్ సొసైటీ'ని స్థాపించాడు. ఈ కేంద్రాలన్నీ ఉచితంగానే సేవలందించేవి. స్థానికుల చందాలతోనే నడిచేవి. ప్రపంచ ఆరోగ్య సంస్థ దీన్ని 'అత్యుత్తమ నమూనా'గా గుర్తించి యూరప్‌లో అమలు చేయడం మొదలుపెట్టింది. ఈ నేపథ్యంలోనే 2008లో కేరళ ప్రభుత్వం దేశంలోనే తొలి పాలియేటివ్ కేర్ విధానాన్ని తీసుకొచ్చింది. పదేళ్లకిందట కాలేజీ విద్యార్థులు పెద్ద ఎత్తున వలంటీర్లుగా రావడం మొదలుపెట్టారు. అందుకో కారణమూ ఉంది...

అందరికీ...

ఉద్యోగాల కోసం విదేశాలకి వెళ్లే వాళ్లు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో కేరళ ఒకటి. అందువల్ల అక్కడి లంకంత ఇళ్లల్లో ఒంటరిగా గడిపే వృద్ధుల సంఖ్య ఎక్కువ... సుమారు నాలుగులక్షలమంది అలాంటివాళ్లు ఉంటారని అంచనా. దాంతో కేరళలో వాళ్లకీ పాలియేటివ్ కేర్‌ని విస్తరించారు. దానికి తగ్గట్టే యువతని ఈ సేవల్లోకి ప్రోత్సహించారు. కొన్ని యూనివర్సిటీలు ఇలా సేవలందించేవాళ్లకి అదనపు మార్కులు వేయడం ప్రారంభించాయి. దాన్నే క్రమంగా పాఠశాల స్థాయికీ తీసుకొచ్చారు.

ప్రస్తుతం బడుల నుంచీ నేరుగా పంచాయతీ స్థాయి పాలియేటివ్ కేర్ సెంటర్‌లలో విద్యార్థులు వలంటీర్లుగా చేరుతున్నారు. వారానికి రెండురోజుల వంతున సేవలతో మొదలుపెడతారు... ఆసక్తిని బట్టి రోజూ వెళ్లేవాళ్లూ ఉంటున్నారు. కాలేజీ పూర్తయ్యేసరికి... సామాజిక బాధ్యత నిండిన పరిణత యువతగా మారుతున్నారు! ★

తియ్యగా, నోట్లో వేసుకుంటే కరిగిపోతాయని చాక్లెట్లను అతిగా తిన్నామా... వందలకొద్దీ కెలోరీలు చేరిపోతాయి. అదనంగా అనారోగ్య సమస్యలూ దాడిచేసే ఆస్కారమూ లేకపోలేదు. అలాగని ఎదురుగా అవి ఉంటే నోరు కట్టేసుకుని కూర్చోవడం ఎంత కష్టం చెప్పండి... అనే చాక్లెట్ల ప్రియులకోసమే ఇప్పుడు మొక్కల ఆధారిత చాక్లెట్లు వస్తున్నాయి. రంగు, రూపు, రుచిలో ఏ మాత్రం తేడాలేక పోయినా, ఆరోగ్యానికి మేలుచేస్తూ, కొత్తగా వచ్చేస్తున్న ఈ ప్లాంట్‌బేస్డ్ చాక్లెట్ల గురించి ఇంకాస్త వివరంగా తెలుసుకుందామా....

ఈ చాక్లెట్లు.. ఎన్నయినా తినేయొచ్చు!



పిల్లలకు ఎన్ని బొమ్మలు కొనివ్వండి... ఎదురుగా చాక్లెట్లు కనిపిస్తే వాళ్ల ముఖం వెలిగిపోతుంది. పెద్దవాళ్లూ అంతే... వయసుతో సంబంధం లేకుండా పిల్లలతో సమానంగా చాక్లెట్లను ఇష్టపడతారు. ఇలా అన్నివయసుల వారినీ ఆకట్టుకునే చాక్లెట్లు ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు కోరుకున్న రుచిలో దొరికేస్తున్నా అతిగా తింటే కెలోరీలు పెరిగిపోతాయనీ, ఆరోగ్యానికి హాని జరుగుతుందనీ భయపడతాం. అలాంటివేవీ లేకుండా నచ్చినట్లుగా వాటిని తినాలని కోరుకునే వారికోసం వస్తున్నవే ప్లాంట్‌బేస్డ్ చాక్లెట్లు. అంటే మొక్కల నుంచి సేకరించిన పదార్థాలతో తయారుచేసినవి అన్నమాట. అవేంటో తెలుసుకునేముందు అసలు సాధారణ చాక్లెట్లను మితంగా ఎందుకు తీసుకోవాలనేది చూద్దాం. మనకు బజార్లో దొరికే చాక్లెట్ల తయారీలో కోకో పొడి, కోకో బటర్, చక్కెర, వెనిల్లా ఎసెన్స్, మృదుత్వం కోసం లెసిథిన్ అనే పదార్థాలను కలుపుతారు. అదే మిల్క్‌చాక్లెట్‌లో పాల పొడి అదనంగా ఉంటుంది. ఇక, రుచిని పెంచేందుకు రకరకాల నట్స్‌నీ వేస్తారు. వీటన్నింటితో- కాస్త తిన్నా కెలోరీలు పెరిగి స్థూలకాయం, నిద్రలేమి సమస్యలు ఎదురవుతాయి. చక్కెర మోతాదు కూడా ఎక్కువే కాబట్టి పళ్లు పుచ్చిపోయే ప్రమాదమూ ఉంటుంది. పిల్లల్లో మెదడు పనితీరు పైనా ఇవి ప్రభావాన్ని చూపుతాయని పరిశోధనలూ తెల్పాయి. ఇవన్నీ గమనించే ప్రత్యామ్నాయ పరిష్కారంగా ఇలా ప్లాంట్‌బేస్డ్ చాక్లెట్లను తీసుకొచ్చారు తయారీదారులు.

ఎలా చేస్తారంటే...

ఈ చాక్లెట్ల తయారీలో అన్నీ మొక్కల నుంచి సేకరించిన పదార్థాలే ఉంటాయి. వీటిలో ప్రధానమైంది కోకో అయితే... అదనంగా పాలకు బదులుగా ఓట్స్, బాదం, బియ్యం, కొబ్బరి, జీడిపప్పు తదితరాల నుంచి తయారుచేసిన పాలను ఎంచుకుంటారు. తీపికోసం కొబ్బరిచక్కెర, స్టీవియా, డేట్స్ సిరప్, మేపల్ సిరప్‌లను వాడతారు. అలాగే అదనపు రుచికోసం బాదం, పిస్తా, జీడిపప్పు, కిస్‌మిస్ పలుకులు... క్రాన్‌బెర్రీ, ఆప్రికాట్లు, స్ట్రాబెర్రీ తదితర పండ్లనూ లేదా ఆ గుజ్జుల్ని వేస్తారు. ఇక, లాభాల గురించి చెప్పాలంటే... కోకోనే తీసుకుంటే దీనిద్వారా అందే యాంటీయాక్సిడెంట్లు అధికరక్తపోటునూ ఒత్తిడినీ తగ్గిస్తే ఫ్లవనాయిడ్లు జ్ఞాపకశక్తికి తోడ్పడతాయి. చక్కెర, పాల వినియోగం తక్కువగా ఉండటం వల్ల శాచురేటెడ్‌ఫ్యాట్స్ భయం ఉండదు. ఫలితంగా కొలెస్ట్రాల్ సమస్యా దరిచేరదు. డార్క్‌చాక్లెట్ వినియోగం ఎక్కువగా ఉంటుంది కాబట్టి.. ఇది మెదడు పనితీరునూ చురుగ్గా ఉంచుతుంది. రక్తంలో చక్కెరస్థాయుల్నీ క్రమబద్ధం చేస్తాయి. వీటి తయారీలో ఉపయోగించే నట్స్, ఇతర గింజల వల్ల గట్‌హెల్త్ కూడా బాగుంటుందంటున్నారు నిపుణులు. ఇన్ని లాభాలు ఉన్నాయి కాబట్టే... ఇప్పుడు ఆబ్రియోనా, పాల్ అండ్ మైక్, ఫేబెల్... వంటి ఎన్నో సంస్థలు ఈ ప్లాంట్‌బేస్డ్ చాక్లెట్లను తీసుకొస్తున్నాయి. అంతే కాదు... మనకు నచ్చినట్లుగా వీటిని కస్టమైజ్ కూడా చేయించుకునేలా కొన్ని చాక్లెట్ తయారీ సంస్థలూ అందుబాటులో ఉన్నాయి. అదండీ ఈ వీగన్ లేదా ప్లాంట్‌బేస్డ్ చాక్లెట్ల కథాకమామీషు. కాబట్టి... చాక్లెట్లను తినొద్దంటూ పిల్లల్ని ఆపకుండా అడిగినప్పుడల్లా ఇచ్చేందుకు రెడీ అయిపోండి. మీరూ కెలోరీల గురించి ఆలోచించకుండా హాయిగా చప్పరించేయండి. ★




కళ్లల్లోకి కళ్లు పెట్టి చూస్తే అవతలి వ్యక్తి మనసులోని మాటలు అందరికీ అర్థం కాకపోవచ్చు. కానీ సరికొత్తగా వస్తున్న ఈ స్మార్ట్ గ్లాసెస్ పెట్టుకున్నారంటే మాత్రం ప్రపంచం మొత్తం కళ్లముందే కనిపించేస్తుంది. అవును... కళ్లజోడే ఫోన్‌కాల్స్ చేస్తుంది, మెసేజ్‌లూ పంపుతుంది. నచ్చిన సంగీతం వినిపిస్తుంది, టీవీనీ ప్రత్యక్షం చేస్తుంది. ఫొటోలూ, వీడియోలూ తీస్తుంది. తెలియని ప్రాంతాల్లో దారి చూపిస్తుంది. అర్థంకాని భాషను అనువదించి పెడుతుంది. చుట్టూ ఉన్న పరిసరాల వివరాలూ చెబుతుంది. అంతేనా... ఆఖరికి అవసరమైన చోట పేమెంట్లూ చేస్తూ అన్ని పనుల్లో భాగమవుతుంది. ఈ గేమ్ ఛేంజింగ్ స్మార్ట్ గ్లాసెస్... ఆసక్తికరమైన సంగతులే ఇవన్నీ!





కళ్లజోడు... స్మార్ట్‌గా చూడు!





కళ్లు సరిగా కనిపించడం లేదనీ, సైట్ పెరిగిందనీ, తలనొప్పి వస్తోందనీ కళ్లజోడు పెట్టుకుంటారు చాలామంది. ఎండ నుంచి రక్షణగానూ, స్క్రీన్ లైట్ నేరుగా కంటి మీద పడకుండానూ మరికొందరు గ్లాసెస్ ధరిస్తారు. ఇంకా ఫ్యాషన్ ప్రియులూ కళ్లద్దాలతో వేసుకున్న డ్రెస్సుకు తగ్గట్టు స్టైలిష్ లుక్కును తెచ్చుకుంటారు. కానీ ప్రస్తుతం కళ్లజోడు అవసరం పూర్తిగా మారిపోయిందనే చెప్పాలి. కేవలం చూపును సరిచేయడానికో, కళ్లను కాపాడ్డానికో కాకుండా... చక్కని టెక్ గ్యాడ్జెట్‌గా సిద్ధమైపోయింది. అన్ని రకాల పనుల్లో చేదోడువాదోడుగా ఉంటూ ఓ పర్సనల్ అసిస్టెంట్ అయింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈతరానికి తగ్గట్టు టెక్నాలజీని జత చేసుకుంటూ- కొత్త లుక్కుతో కనిపిస్తూనే, ఎన్నో ఫీచర్లతో మన ముందుకొచ్చేశాయి ఈ స్మార్ట్ గ్లాసెస్. అన్ని రంగాల్లో దూసుకుపోతున్న కృత్రిమ మేధను కళ్లజోడులోనూ తీసుకురావడంతో వచ్చిన ఈ మార్పు- ఇతర గ్యాడ్జెట్ల అవసరాన్ని తీరుస్తోంది, స్మార్ట్‌ఫోన్‌కు మించి సాయపడు తోంది. 'అబ్బ, ఈ నయా టెక్ గ్లాసెస్ కబుర్లు వినడానికి ఎంతో హాయిగా ఉన్నాయి కానీ, ఒక్క కళ్లజోడుతోనే ఇన్ని రకాల ఉపయోగాలు ఉన్నాయంటే- రోజూ ఈ స్మార్ట్ కళ్లజోడును పెట్టుకోవడం సాధ్యమేనా... మామూలు గ్లాసెస్‌లా ఇవి అందంగా ఉండవేమో... బరువుగా, మోటుగా ఉంటాయేమో... చూడ్డానికి విచిత్రంగానూ కనిపిస్తాయనుకుంటా...' అంటారేమో- కానీ అలాంటి సందేహాలేమీ అక్కర్లేదండి. ఈ ఏఐ గ్లాసెస్‌లోనూ బోలెడన్ని ఫ్యాషన్ ఆప్షన్లు ఉన్నాయి. మనం కోరుకున్నట్టు తీరొక్క స్టైల్‌లోనూ దొరుకుతున్నాయి. మామూలు కళ్లజోళ్లే మరింత అందంగా, హైటెక్ లుక్కుతో వస్తున్నాయన్నమాట.

ఎన్ని ఫీచర్లో...

పెద్ద పెద్ద కంపెనీలు సాంకేతికతలో ఎప్పటికప్పుడు మార్పులు చేసుకుంటూ కొత్త వెర్షన్ స్మార్ట్ గ్లాసెస్‌ను తీసుకొస్తున్నాయి. అందులో భాగంగానే ఆగ్మెంటెడ్ రియాలిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని వాడుతూ అడ్వాన్స్‌డ్ స్మార్ట్ గ్లాసెస్‌కి రూపమిస్తున్నారు. ఈమధ్య మార్కెట్లోకి వచ్చిన ఈ కళ్లద్దాలు టెక్ ప్రియుల్ని తెగ ఆకట్టుకుంటున్నాయి. అందులో 'రేబాన్ మెటా డిస్‌ప్లే గ్లాసెస్' ఫీచర్లు చూస్తే కచ్చితంగా ఆశ్చర్యపోవాల్సిందే. ఇవి చూడ్డానికి మామూలు గ్లాసెస్‌లానే కనిపించినా- దీన్ని యాప్‌కి కనెక్ట్ చేసుకుని పెట్టుకున్నామంటే వంద పనులు ఆ కళ్లజోడుతోనే పూర్తి చేసుకోవచ్చు. దీనికి జతగా వచ్చే న్యూరల్ బ్యాండ్‌ని చేతికి పెట్టుకుని వాటిన్నింటినీ ఆపరేట్ చేయొచ్చు. కెమెరా, మైక్రోఫోన్లూ, టచ్ సిస్టమ్‌లాంటివన్నీ ఉంటాయి ఇందులో. ఇంకా బయటి వెలుతురుకు తగ్గట్టు లెన్స్ అడ్జెస్ట్ అవ్వడం దగ్గర్నుంచీ అడిగిన ప్రతి ప్రశ్నకు జవాబు దొరకడం వరకూ చాలా ఫీచర్లే ఉన్నాయి.ముని వేళ్లతో చెవి మీదున్న ఫ్రేమ్ అంచును నొక్కితే, ఫోన్‌కాల్స్‌కి స్పందించొచ్చు. వాయిస్ కమాండ్స్‌తో వాట్సాప్, వీడియో కాల్స్ చేయొచ్చు. అసలు ఫోన్ చూడకుండానే మనకొచ్చిన మెసేజెస్‌కి బదులు ఇవ్వొచ్చు. కావాలంటే అదంతా గ్లాసెస్‌కు ఒకవైపు తెర మీద డిస్‌ప్లే అవుతుంది కూడా. అంతేనా... ఏదైనా వస్తువో, పువ్వో కొత్తగా కనిపించినా దాన్ని కళ్లజోడుతో చూస్తే చాలు, ఆ వివరాలన్నీ తెలిసిపోతాయి. కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడు బోర్డులూ, రెస్టరంట్లలో ఫుడ్ వివరాలు అర్థంకాకపోయినా, ఇతరులు మాట్లాడే భాషలు తెలియకపోయినా అనువదించి వివరంగా చెబుతుంది ఈ కళ్లజోడు. చేతికి వేసుకున్న బ్యాండ్ సాయంతో వేళ్లను అటూ ఇటూ కదుపుతూనే ఫోన్లోని యాప్స్ అన్నింటినీ వాడుకోవచ్చు. సమావేశాల్లో శ్రద్ధగా వింటూనే హ్యాండ్ గెస్చర్లతో దాన్ని నోట్ చేసుకోవచ్చు కూడా. విహార యాత్రలకూ, బైక్ రైడింగ్‌లకూ వెళ్లినప్పుడు ఒకవైపు ఆ అందమైన ప్రకృతి దృశ్యాల్ని కళ్లతో ఆస్వాదిస్తూనే,



మరోవైపు కళ్లజోడుతో వాటన్నింటినీ వీడియో రికార్డు చేయొచ్చు, ఫొటోలూ తీసుకోవచ్చు. అంతేనా... అప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేసుకోవచ్చు కూడా. మన అవసరాన్ని బట్టి వీటిల్లోని గ్లాసెస్‌ని ఎంచుకుని కొనుక్కోవచ్చు. దీంట్లో సన్ గ్లాసెస్, క్లియర్, పోలరైజ్డ్, ట్రాన్సిషన్స్, ప్రిస్క్రిప్షన్ లెన్స్‌లాంటివన్నీ ఉన్నాయి.

క్రీడాకారులూ, సాహసికులూ 'ఓక్లే మెటా హెచ్‌ఎస్‌టీఎన్ గ్లాసెస్'ని ఎంచుకోవచ్చు. ఈ కళ్లజోడు వాతావరణ సమాచారం గురించి అప్‌డేట్ చేస్తూనే, యూవీ ప్రొటెక్షన్‌నీ ఇస్తుంది. ఇంకా హై క్వాలిటీతో వీడియోల్ని క్యాప్చర్ చేస్తూ... మరిచిపోలేని దృశ్యాల్ని రికార్డు చేస్తుంది.

వీటన్నింటితోపాటు కళ్లముందు క్షణాల్లో పెద్ద తెర ప్రత్యక్షం కావాలంటే మాత్రం 'ఎక్స్‌రియల్ వన్ ప్రొ స్మార్ట్ గ్లాసెస్'ని ట్రై చేయొచ్చు. ఈ కళ్లద్దాల ద్వారా వర్చువల్ స్క్రీన్‌ను ఏర్పాటు చేసుకుని ఎంచక్కా సినిమాలూ చూడొచ్చు, ఆటలూ ఆడుకోవచ్చు. చక్కటి విజువల్ క్వాలిటీ, సౌండ్ సిస్టమ్‌తో డిజిటల్ తెరను ఏర్పాటుచేస్తుందీ కళ్లజోడు. దీంతో అత్యవసర సమయాల్లో పెద్ద తెరలో ఆఫీసు వర్క్ కూడా చేసుకోవచ్చు. కిచెన్లో వంటలు చేస్తున్నా... ఫోన్ తీయకుండానే వర్చువల్ తెరతో వీడియోలు చూస్తూ వంట పూర్తి చేయొచ్చు. పైగా ఇది స్లీక్‌గా, స్టైలిష్ లుక్కుతోనూ ఉంటుంది. దీంతోపాటు 'రొకిడ్ మ్యాక్స్ టూ ఏఆర్ గ్లాసెస్'లో కూడా అందమైన డిజైన్లతో, అద్భుతమైన త్రీడీ డిస్‌ప్లే ఆప్షన్ ఉంది.

ఇక బెస్ట్ ఏఐ అసిస్టెంట్‌గా పనిచేస్తుంది 'హాలిడే గ్లాసెస్'. సమావేశాల్లో, ముఖ్యమైన సంభాషణల్లో ఎదుటివారితో మాట్లాడుతున్నప్పుడు అప్పటికప్పుడు అవసరమైన సమాచారాన్ని అందిస్తుంది ఈ కళ్లజోడు. దీని వల్ల భయం లేకుండా ఆత్మవిశ్వాసంతో మాట్లాడొచ్చు. ఇంకా అడిగిన సందేహాలన్నింటికీ వెంటవెంటనే సమాధానాలు చెబుతూనే ఉంటుంది. దాదాపు 40 భాషల్ని అనువదిస్తుంది. మీటింగ్స్‌లో ఆడియో రికార్డుల్ని టెక్ట్స్ రూపంలోనూ అందిస్తుంది. ఇవేకాదు, 'లుక్, స్పీక్, పే' ఆప్షన్‌తో యూపీఐ పేమెంట్ చేసేలా లెన్స్‌కార్ట్ స్మార్ట్ గ్లాసెస్ కూడా వస్తున్నాయి.

'ఓక్లే వాన్‌గార్డ్' లాంటి స్మార్ట్ గ్లాసెస్‌లో హెల్త్ ఇంకా ఫిట్‌నెస్ ట్రాకింగ్ సదుపాయమూ ఉంటుంది. వీటి ద్వారా మన ఆరోగ్యానికి సంబంధించిన సమాచారమంతా తెలుసుకోవచ్చు. 'ఎన్‌విజన్ గ్లాసెస్' లాంటివి చూపు మందగించినవాళ్లకీ, కళ్లు కనిపించని వాళ్లకీ చాలా బాగా ఉపయోగపడతాయి. వీటి సాయంతో మనుషుల్నీ, ప్రాంతాల్నీ గుర్తుపట్టొచ్చు. పుస్తకాల్లోని అక్షరాలనూ స్కాన్ చేసి వినిపిస్తాయి. ఇలా ఒకటా రెండా, రోజువారీ పనుల్లో ఎన్నో విధాలుగా మరెన్నో రకాలుగా ఉపయోగపడుతున్నాయి ఈ స్మార్ట్ గ్లాసెస్.

వివిధ రంగాల్లోనూ...

అన్ని రంగాల్లోనూ ఈ స్మార్ట్ కళ్లద్దాలు దూసుకొస్తున్నాయి. ఈమధ్య అమెజాన్ సంస్థ డెలివరీ సామర్థ్యాన్ని మెరుగు పరిచేందుకు ప్రత్యేకంగా ఏఐ స్మార్ట్ గ్లాసెస్‌ను తీసుకొచ్చింది. ఉద్యోగులు ప్యాకేజీలను స్కాన్ చేయడానికీ, డెలివరీ వేగం పెంచడానికీ, చిరునామాల్ని సులువుగా తెలపడానికీ వీటిని డిజైన్ చేసింది. పార్కింగ్ చోటు దగ్గర్నుంచీ డెలివరీకి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఫోన్ సాయం లేకుండానే ఈ గ్లాసెస్ ద్వారానే తెలుసుకోవచ్చుట. వైద్య రంగంలో ఉపయోగపడేలా మెడికల్ స్మార్ట్ గ్లాసెస్ కూడా వస్తున్నాయి. ఎప్పటికప్పుడు రోగి ఆరోగ్య వివరాలన్నీ తెలపడానికీ, పరీక్షల రిపోర్ట్స్‌ని చూపడానికీ, శస్త్ర చికిత్సల్లో సూచనలూ, సలహాలూ ఇవ్వడానికీ ఇవి అవసరం అవుతాయి.

ఫీచర్లూ, టెక్నాలజీని బట్టి ఈ స్మార్ట్ గ్లాసెస్ ధరలు వేల నుంచి లక్షల రూపాయల వరకూ ఉన్నాయి. మన అవసరాలకు తగ్గట్టు వీటిల్లో ఓ స్మార్ట్ గ్లాసెస్‌ను కొనుక్కుని కళ్లకు పెట్టుకున్నామంటే... కచ్చితంగా ప్రపంచాన్ని మరింత స్మార్ట్‌గా చూసేయొచ్చు! ★



పేద పిల్లలకు... విద్యాదానం చేస్తూ!

ఈ సేవా మూర్తుల లక్ష్యం... పేద, గ్రామీణవర్గాలకు చెందిన పిల్లల జీవితాలను తీర్చదిద్దడమే. అందుకు చదువునే ఆయుధంగా ఎంచుకున్నారు. ఆ పిల్లల భవిష్యత్తుకు మంచి పునాదిని వేసేందుకు ప్రయత్నిస్తున్నారు.





ఆర్థికసాయంతో ప్రోత్సహిస్తూ...

పేద కుటుంబాల నుంచి వచ్చినా... బాగా చదువుకోవాలనీ, జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలనీ కోరుకునే విద్యార్థులు ఎందరో. అలాంటి వారిని ప్రోత్సహించేందుకు ఏర్పాటైందే 'ఆనందం యూత్ ఫౌండేషన్'. సెల్వకుమార్ అనే మానవతామూర్తి ప్రారంభించిన ఈ సంస్థ ప్రతిభావంతులైన గ్రామీణ, పేద పిల్లలు ఎలాంటి ఆటంకం లేకుండా చదువుకునేందుకు వందశాతం ఆర్థికసాయాన్ని అందిస్తుంది. ఇంజినీరింగ్, వైద్యం... ఇలా ఏది చదవాలనుకున్నా సరే ఈ సంస్థను సంప్రదిస్తే ఆ విద్యార్థుల చదువుకు అయ్యే ఫీజు మాత్రమే కాకుండా హాస్టల్, భోజనం, రవాణా, పుస్తకాలు... తదితర ఖర్చుల్ని కూడా భరిస్తుంది. అంతేకాదు వాళ్లు చదువులో ఇబ్బంది పడకుండా, సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రత్యేకంగా మెంటార్లను కూడా ఏర్పాటు చేస్తుంది. అదనంగా స్పోకెన్ ఇంగ్లిష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, మాక్ ఇంటర్వ్యూలు... ఇలా ఎన్నో అంశాలపైన శిక్షణ కూడా అందిస్తుంది. అలా ఈ సంస్థ ద్వారా చదువుకున్న విద్యార్థుల్లో కొందరు ఇన్ఫోసిస్, ఐబీఎం, యాక్సెంచర్, టాటా వంటి సంస్థల్లో ఉద్యోగాలూ తెచ్చుకోవడం విశేషం. తమిళనాడు కొడంబాక్కమ్‌లో ఉండే ఈ సంస్థ ఇప్పటివరకూ వెయ్యిమందికి పైగా పేద విద్యార్థులకు అండగా నిలిచింది.



పాఠశాలను ప్రారంభించిన పోలీసు

నిరుపేద కుటుంబం నుంచి వచ్చి, కష్టపడి చదువుకుని పోలీసు ఉద్యోగాన్ని సంపాదించుకున్నాడు థాన్‌సింగ్. ఇప్పుడు ఓ వైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు మురికివాడలకు చెందిన పిల్లలకు చదువు చెప్పేందుకు 'థాన్‌సింగ్‌కీ పాఠశాల' పేరుతో చిన్న స్థాయి స్కూలునే ప్రారంభించాడు. ఎంతోమంది పిల్లలకు చదువు చెబుతూ ఆ తర్వాత వాళ్లను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇలా చేయడానికి తన జీవితమూ ఓ కారణమే అంటాడు. థాన్‌సింగ్ స్వస్థలం రాజస్థాన్ అయినా దిల్లీలో పెరిగాడు. తండ్రి పెద్దగా చదువుకోక ఇస్త్రీ కొట్టు పెట్టుకున్నాడు.



థాన్‌సింగ్ కూడా చిన్నతనంలో మొక్కజొన్న అమ్ముతూ కష్టపడి చదువుకుని కానిస్టేబుల్ అయ్యాడు. ఉద్యోగం వచ్చాక ఓసారి సరదాగా తాను పెరిగిన వాడకు వెళ్లాడట. అక్కడ పెద్దవాళ్లు పనులకు వెళ్తుంటే వాళ్ల పిల్లలు చెత్త ఏరుకోవడం, ప్లాస్టిక్ వస్తువులు అమ్ముకోవడం చూశాడట. ఈ పరిస్థితికి ఫుల్‌స్టాప్ పెట్టాలనుకున్న థాన్‌సింగ్ బాగా ఆలోచించి రెడ్‌ఫోర్ట్‌కు దగ్గర్లో వాళ్లకు చదువు చెప్పేందుకు సిద్ధమయ్యాడు. ఆ పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి ఒప్పించడంతో నెమ్మదిగా ఒక్కొక్కరూ రావడం మొదలుపెట్టారట. స్థానికంగా ఉండే రాజ్‌ఘాట్, విజయ్ ఘాట్‌లకు చెందిన వందమందికి పైగా పిల్లలు థాన్‌సింగ్ పాఠశాలకు వచ్చి అక్షరాలు దిద్దుతుంటే ఈయనకు కొందరు వలంటీర్లూ, దాతలూ సాయంచేస్తున్నారట. ఇప్పటికే డెబ్భైమందికి పైగా పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్చాడట.

ప్రైవేటు స్కూళ్లలో చదువుకునేలా...





పిల్లలకు చిన్నతనంలోనే చదువులో సరైన పునాది పడితే తరగతులు పెరిగేకొద్దీ ఎలాంటి ఇబ్బందీ ఉండదు. పైగా ఇష్టంగానూ చదువుతారని అర్థం చేసుకున్నారు జేమ్స్ సురేశ్ అంబట్ అనే సేవామూర్తి. అందుకే మురికివాడలూ, పేద కుటుంబాలకు చెందిన చిన్నారులకూ సరైన విద్యను అందించేందుకు బెంగళూరులో 'బిల్డింగ్‌బ్లాక్స్ ఇండియా' పేరుతో ఓ సంస్థను ప్రారంభించారు. మిగిలిన వాటితో పోలిస్తే కాస్త భిన్నంగా పని చేస్తుందిది. సాధారణ స్కూళ్లలో ఉండే ఎల్‌కేజీ, యూకేజీలతో సమానంగా ఈ ఎన్‌జీఓ కూడా మూడేళ్లపాటు పిల్లలకు కిండెర్‌గార్టెన్ పేరుతో ప్రత్యేక శిక్షణ అందిస్తుంది. అందులో భాగంగా అక్షరాల్నీ, అంకెల్నీ దిద్దించడంతోపాటు ఇంగ్లిష్, బేసిక్ స్కిల్స్, పరిశుభ్రత వంటి ఎన్నో అంశాలను నేర్పిస్తారు. మూడేళ్లు పూర్తయ్యాక వాళ్లకు సర్టిఫికెట్లను అందించి ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తూ పదో తరగతి పూర్తి చేసేలా ప్రోత్సహిస్తారు. అప్పుడు మాత్రం ఆ పిల్లల్ని దాతలు దత్తత తీసుకుని ఫీజు కట్టేలా చూస్తుందీ సంస్థ. ఇప్పటివరకూ ఎంతోమంది పిల్లల్ని చదివించిన ఈ ట్రస్టు ప్రారంభమైంది గ్యారేజీలోనే అయినా... క్రమంగా పదకొండు శాఖలకు విస్తరించింది. ఇక్కడకు వచ్చే పిల్లలకు చదువుతోపాటు రెండుపూటలా భోజనం కూడా పెట్టే ఈ ఎన్జీఓ- యువతకూ మహిళలకూ కంప్యూటరులో శిక్షణ కూడా అందిస్తుండటం గమనార్హం.





'డబ్బులేమైనా
చెట్లకు కాస్తున్నాయా?'
ఇకపైన ఈ మాట అనాలంటే
ఆలోచించాలేమో! ఎందుకంటే చెట్లకు
డబ్బులు కాయకపోవచ్చు కానీ, అంతకంటే
విలువైన బంగారం, వెండి, నికెల్, కాడ్మియం
వంటివి పండుతున్నాయి మరి! వరీ, పెసలూ,
మినుములని సాగు చేస్తున్నట్టే... రైతులు
లోహాలనీ సాగు చేసేస్తున్నారు. అదెక్కడో,
ఎందుకో తెలుసుకుందాం రండి...

బంగారం, వెండి... చెట్లకు పండుతాయా?





చెర్నోబిల్ సంఘటన... సుమారు 40 ఏళ్ల కిందట జరిగిందీ భయానక ఘటన. ఉక్రెయిన్‌లో అణువిద్యుత్ కేంద్రం దగ్గర జరిగిన ఓ ప్రమాదం వల్ల... అక్కడి నేలా, నీరూ అన్నీ విషంగా మారిపోయాయి. దాంతో కొన్ని లక్షలమంది రాత్రికిరాత్రే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఆ తర్వాత ఆ నేల ప్రాణాలు తోడేసే మరుభూమిగా మారిపోయింది. మరి చెర్నోబిల్‌ని తిరిగి మామూలు నేలగా మార్చేదెలా? అప్పుడు శాస్త్రవేత్తలకు దొరికిన పరిష్కారమే 'బయో రెమిడియేషన్'. ప్రకృతిలో కొన్ని రకాల చెట్లకు వాతావరణంలో ఉన్న విష వాయువులనీ, లోహాలనీ పీల్చుకుని వాటిని తమలో దాచుకునే శక్తి ఉంటుందని శాస్త్రవేత్తలు తెలుసుకున్నారు. అలా చెర్నోబిల్‌లో 1990లో వేసిన పొద్దుతిరుగుడు మొక్కలూ, ఆవపంటలే ఆ నేలని కాపాడాయి. ఆ తర్వాత నుంచే భూమిని తవ్వాల్సిన పనిలేకుండా, లోహాలను పంటల నుంచీ వెలికితీసే 'ఫైటో మైనింగ్' లేదా 'అగ్రి మైనింగ్' పైన శాస్త్రవేత్తలు దృష్టి పెట్టారు.

ఈవీ బ్యాటరీల కోసం...

పసిడి అంటే మనకెంత మోజో... పరుగులు పెడుతున్న దాని ధరని చూస్తేనే తెలుస్తుంది. ఇక, వెండి గురించి ప్రత్యేకించి చెప్పాలా? అదీ పసిడి వెనకే పరుగులు పెడుతోంది. భవిష్యత్తంతా పెట్రోల్, డీజిల్ అవసరం లేని ఎలక్ట్రిక్ వాహనాలదే అని తెలుసుకదా! అయితే వీటికి చమురు అవసరం లేదు కానీ, వాటిలో బ్యాటరీ నడవాలంటే మాత్రం నికెల్- కాడ్మియం వంటి లోహాలు కావాలి. మరి భూమిలో ఉన్న బంగారం, వెండి, నికెల్ వంటి లోహాలు మన చేతివరకూ రావాలంటే సంప్రదాయ పద్ధతిలో మైనింగ్ చేయాల్సిందే. అంటే భూమిని లోతుగా తవ్వాలి, అడవులని నరకాలి. ఇక, వెలికితీసిన ఆ లోహాలని శుద్ధి చేసే క్రమంలో నేలా, నీరూ, గాలీ అన్నీ కలుషితం అయిపోతున్నాయి. ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. దీనికి పూర్తి విరుద్ధంగా సాగే ప్రక్రియే 'ఫైటో మైనింగ్'. భూమిని తవ్వే పనిలేకుండా చెట్ల ద్వారా లోహాలని వెలికితీసే పద్ధతి ఇది. సన్‌ఫ్లవర్, ఆవ, పొగాకు, యూకలిప్టస్, స్ప్రూస్, ఫెర్న్, హెంప్ వంటి కొన్ని మొక్కలకి బంగారం, వెండీ, నికెల్, కాడ్మియం సహా ఇతర లోహాలని తమ ఆకుల్లో, వేర్లలో, బెరడులో దాచుకునే శక్తి ఉంది. ఆ మొక్కలని ఎండబెట్టి, బూడిద చేయడం ద్వారా మనం వాటిని సేకరించవచ్చు. 'అరె మొక్కల్లో ఉండే ఆ కొద్దిపాటి లోహాల గురించి చెప్పుకోవడానికి బాగుంటుంది కానీ, వాటిని పండించడం ఆచరణలో అయ్యేపనేనా' అనే అనుమానం వస్తోంది కదా... కానీ అల్బేనియాలో 'మెటల్ ప్లాంట్' అనే స్టార్టప్ ఎందుకూ పనికిరాని బీడు భూముల్లో 'ఒడోంటారెనా' అనే మొక్కలని సాగు చేసి హెక్టార్‌కి 400 కేజీల నికెల్‌ని పండిస్తోంది. ఇండోనేషియాలోని కినబాలు ప్రాంతంలో ఉన్న 'ఫైక్‌నాంద్రా' అనే ఒక చెట్టు అయితే రబ్బరు చెట్టు జిగురుని స్రవించినట్టుగా, నికెల్‌ని స్రవిస్తుంది. దీనిమొత్తం బరువులో 25శాతం నికెల్ ఉంటుందట. స్థానికులు ఈ చెట్లని సాగుచేసి నికెల్‌ని పండిస్తున్నారు. వీటిని పెంచడానికి అమెరికా, చైనా, బ్రెజిల్, క్యూబా సహా అనేక దేశాలు ముందుకు వస్తున్నాయి. అందుకు కారణం ఎలక్ట్రానిక్స్ తయారీలో నికెల్ వాడకం పెరగడమే.

'సరే, మరి మనకెంతో ఇష్టమైన బంగారం మాటేంటి... దాన్నికూడా పండించుకోవచ్చా' అనేగా మీ సందేహం. ఈమధ్యనే ఫిన్‌ల్యాండ్‌లో క్రిస్మస్ చెట్లుగా పిలిచే స్ప్రూస్ వృక్షాల్లో బంగారపు రేణువుల జాడని కనిపెట్టారు శాస్త్రవేత్తలు. ఒక్క స్ప్రూస్ చెట్లకే కాదు సన్‌ఫ్లవర్, ఆవ, యూకలిప్టస్ చెట్లకూ బంగారాన్ని దాచుకునే గుణం ఉంది. అయితే సంప్రదాయ పద్ధతితో పోలిస్తే ఈ విధానంలో ఎక్కువ ఖర్చు ఉంటుంది కాబట్టి- ప్రస్తుతం ఈ మొక్కలని లోహాలను వెలికితీయడానికి కాకుండా మైనింగ్ తర్వాత కలుషితం అయిన నేలని శుభ్రం చేయడానికి ఎక్కువగా వాడుతున్నారు. ఇలా మొక్కల నుంచి వెలికి తీసిన లోహాలతో 'హెచ్2ఈఆర్‌జీ' అనే సంస్థ నగలనూ తయారుచేస్తోంది. ఏది ఏమైనా, ఖర్చు తక్కువలోనే భూమిలోని లోహాలను వెలికి తీసేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించే రోజు ఎంతో దూరంలో లేదంటున్నారు సైంటిస్టులు. అప్పుడిక బంగారాన్నీ వెండినీ మన పెరట్లోనే పండించుకోవచ్చన్నమాట! ★



కథ

సారె

- కొయిలాడ రామ్మోహన్‌రావు

"ఏమిటీ? మళ్ళీ ఉద్యోగం వదిలేశావా? మరో ఉద్యోగం దొరుకుతుందనే గ్యారంటీ ఉందా? ఈ పదేళ్ళలో డజను ఉద్యోగాలు మారావు. ఈపాటికి అందరికీ నీ సంగతి తెలిసిపోయి ఉంటుంది. నీకు ఉద్యోగం ఎవడిస్తాడు?" అవని కోపంగా అడుగుతున్నా, ఆమె గొంతులో ధ్వనిస్తున్న అంతులేని ఆవేదనను గుర్తించినా, శ్రీకర్ నిర్లిప్తంగా ఉండిపోయాడే తప్ప ఏమీ మాట్లాడలేదు. దాంతో అవనికి ఇంకా కోపం వచ్చింది.

"లక్ష రూపాయల నెల జీతాన్ని తృణప్రాయంగా వదిలేశావు? ఇల్లు ఎలా గడుస్తుందో ఆలోచించావా? పిల్లలు పెద్దవాళ్ళు అవుతున్నారు. ఖర్చులు పెరుగుతున్నాయి. నా ఒక్క సంపాదనతో ఎలా నెట్టుకురావాలి?" అంది కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే.

"ఎప్పుడూ ఏడవడమేనా? నన్ను అసలు అర్థం చేసుకోవా? ఈ ఆఫీసులో కూడా అందరూ సన్నాసులే. మా మేనేజర్‌కి కూడా పనిచేయడం రాదు. నేను చేసిన పనులన్నీ వాడి ఖాతాలో వేసుకుని, సీఈవో దృష్టిలో గొప్ప పనిమంతుడిలా పేరు కొట్టేస్తున్నాడు..." అంటుండగా అడ్డుతగిలింది అవని.

"అందుకేగా నీకు అప్పుడప్పుడూ ఏదో రకంగా ఇన్సెంటివ్‌లు ఇస్తున్నాడు" అంది.

"అంటే... వాడు వేసే కుక్క బిస్కట్లకు నా ఆత్మాభిమానాన్ని పణంగా పెట్టమంటావా?" అంటూ మండిపడ్డాడు.

"నేను అలా అనడం లేదు. కాస్త పరిస్థితులతో రాజీ పడమని అంటున్నాను" అంది.

"అలా రాజీ పడడం వల్లనే ఈ కంపెనీలో ఏడాదిపాటు ఉండగలిగాను. ఇక నా వల్ల కాదు" అని విసురుగా అనేసి, బయటకు పోయాడు. మతిపోయినట్లు చూస్తూ ఉండిపోయింది అవని.

శ్రీకర్ గురించి ఆలోచిస్తుంటే ఆమెకు అనంతం బాబాయి, తన పెళ్ళయిన కొత్తలో అన్న మాటలు గుర్తుకొచ్చాయి. అనంతం ఆమె తండ్రికి దూరపు బంధువు. అయితే వాళ్ళిద్దరిమధ్యా బంధుత్వంకన్నా స్నేహమే ఎక్కువ.

"తల్లీ... నువ్వు అనుకుంటున్నట్లుగా శ్రీకర్ కులాన్ని చూసి మీ నాన్న మీ పెళ్ళిని వ్యతిరేకించలేదు. అతనితో నువ్వు సుఖపడలేవని ముందుచూపుతోనే వాడు వద్దన్నాడు. నీకు నా మాటలు ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు కానీ అడ్డు తగలకుండా విను. శ్రీకర్‌తో మాట్లాడిన పావుగంటలోనే మీ నాన్న అంతా ఆకళింపు చేసుకున్నాడు.

'లాభం లేదురా... శ్రీకర్ వల్ల అవని సుఖపడదు. అతను చాలా తెలివయినవాడే. ఇంటర్‌లో స్టేట్ ఫస్ట్, ఇంజినీరింగ్‌లో యూనివర్సిటీ ఫస్ట్. ఆ విషయం నాకూ తెలుసు. అతనికున్న అపారమైన తెలివితేటలు చూసి, గాఢంగా ప్రేమించేసింది. ఆ తెలివితేటలే కొంప ముంచాయి. బాగా తెలివైన వాడినన్న అహం అతన్ని బాగా ఆవహించింది. ఆ విషయం అందరూ పసిగట్టలేరు, మన అవనితో సహా. నాకు తెలిసి అతను ఎక్కడా ఇమడలేడు. ఏ ఉద్యోగంలోనూ స్థిరపడలేడు. ఏ వ్యాపారానికీ పనికిరాడు. అతని వల్ల మన చిట్టితల్లికి కలకాలం కష్టాలే. కానీ పూర్తిగా అతని లోకంలో మునిగిపోయిన తనకి ఇవన్నీ చెప్పినా అర్థం కావు. కేవలం కులం కారణంగానే అతనితో పెళ్ళి వద్దని అంటున్నానని అనుకుంటోంది. తనకి ఏ విధంగా చెప్పాలో తెలియడం లేదు. ఏమీ చేయలేని పరిస్థితి నాది' అని నాతో అన్నాడమ్మా. నువ్వేమో మీ నాన్న మాట కాదని వాడితో తెగతెంపులు చేసుకుని ఇంట్లోంచి బయటికి వచ్చేశావు. ఎలా బతుకుతావో ఏమిటో?" అంటూ బాధతో అన్న బాబాయ్ మాటలు ఆమె ఇంకా మర్చిపోలేదు.

ఆమె తండ్రి భయపడినట్లే అయింది. ఎవరి దగ్గరా శ్రీకర్ నిలకడగా ఆరు నెలలకు మించి పని చేసేవాడు కాదు. పై అధికారులు చిన్న మాటన్నా పడేవాడు కాదు. మూడేళ్ళ క్రితం స్నేహితులతో కలిసి ఒక స్టార్టప్ కంపెనీ పెట్టాడు. అది బాగా అభివృద్ధిలోకి వచ్చింది కానీ, శ్రీకర్ ధోరణి నచ్చక స్నేహితులతన్ని బయటకు నెట్టేశారు. మళ్ళీ వేరే ఉద్యోగంలో చేరాడు. ఆ ముచ్చటా కొన్నాళ్ళే. 'రోలింగ్ స్టోన్ గ్యాదర్స్ నో మాస్' అన్నట్లు వెయ్యి రూపాయలు కూడా బ్యాంకు అకౌంట్లో లేని పరిస్థితికి వచ్చాడు.

❖ ❖ ❖

తండ్రి పరశురాం మాట వినకుండా పెద్ద తప్పే చేశానని కుమిలిపోతున్న అవనిని, ఆయన జ్ఞాపకాలు చుట్టుముట్టాయి. చిన్న వయసులోనే భార్య చనిపోయినా పరశురాం మళ్ళీ పెళ్ళి చేసుకోకుండా అవనిని తల్లిలాగే సాకాడు. అర్ధరాత్రి లేచి ఆకలని ఏడిస్తే చిరాకు పడకుండా, ఆమెను ఎత్తుకుని బజారు అంతా తిప్పేవాడు. ఆ రాత్రిపూట ఎక్కడా ఏదీ దొరక్కపోతే, దూరంగా ఉన్న సినిమా హాళ్ళ దగ్గరికి వెళ్ళి, దొరికిన



వస్తువులు కొనిపెట్టి ఆ పిల్ల ఏడుపు ఆపేవాడు. ఎవరింటికయినా వెళ్ళినపుడు వాళ్ళు తినడానికి ఏదైనా పెడితే, తను తినకుండా కూతురి కోసం ప్యాక్ చేయడానికి కాగితం ఏదైనా దొరుకుతుందేమోనని చూసేవాడు.

ఆ విషయాలన్నీ అనంతం చెప్తుంటే, తండ్రికి తన మీద ఉన్న అచంచలమైన ప్రేమకు ముగ్ధురాలు అయ్యేది అవని. అటువంటి తండ్రిని శ్రీకర్ కోసం దూరం చేసుకున్నందుకు ఆమె కుమిలిపోని రోజు లేదు. తన మీద బెంగతోనే తండ్రి చనిపోయాడన్న అపరాధభావనతో ఇప్పటికీ నరకం అనుభవిస్తోంది.

❖ ❖ ❖

శ్రీకర్‌తో అవని పెళ్ళి, ఆమె వదినలిద్దరికీ కలిసివచ్చింది. కూతురి మీద ఆకాశమంత ప్రేమ పెంచుకున్న పరశురాం... ఆస్తి అంతా ఆమెకే దోచిపెడతాడేమోనని అవని వదినలిద్దరూ తెగ బాధ పడిపోయేవారు. ఎప్పుడైతే తండ్రికి ఇష్టం లేని సంబంధం చేసుకుని ఇల్లు వదిలి వచ్చేసిందో, అప్పటి నుంచీ చీకు చింతా లేకుండా ప్రశాంతంగా ఉండగలిగారు.

అన్నయ్యలు ఇల్లు అమ్మకానికి పెట్టారనీ, కొనుక్కునే ఆసామీ దాన్ని పడగొట్టించి, పెద్ద షాపింగ్ మాల్ కట్టే ఉద్దేశంతో ఉన్నాడనీ బాబాయి ద్వారా వినగానే, అవని గుండెను ఎవరో నలిపేస్తున్నంత బాధ కలిగింది.

'నాన్న చాలా ఎక్కువ ఆస్తినే గడించారు. ఆయన చనిపోయాక నాకు చిల్లిగవ్వ దక్కకపోయినా, అన్నలిద్దరికీ బాగానే దక్కింది. చెరో ఇరవై ఎకరాల పంట భూమి, కొబ్బరి తోటలు చాలు- వాళ్ళు సుఖంగా బతికేయడానికి. మంచి సెంటర్లో దాదాపు వెయ్యి గజాలలో ఉన్న రాజభవనం లాంటి ఇల్లు అది. నాన్న జ్ఞాపకంగా ఉన్న ఆ ఇంటిని అమ్మేయాలన్న ఆలోచన వాళ్ళకి ఎందుకు వచ్చిందో!' అనుకుంటూ మథనపడిపోయినా, 'నేను చేయగలిగింది ఏముంది? వాళ్ళ ఆస్తి, వాళ్ళ ఇష్టం' అనుకుంది. అయినా ఆమెలో ఒక చిన్న ఆశ మిణుకు మిణుకుమంటుంది. అందుకే అనంతంని కలిసింది.

❖ ❖ ❖

"బాబాయ్... నాదో చిన్న కోరిక ఉంది. తీరుస్తావా?" ప్రాధేయపడుతూ అడుగుతున్న అవనిని అయోమయంగా



చూశాడు అనంతం. అవని ఇలా అభ్యర్థించడం అతను ఎరుగడు. అందుకే అంత ఆశ్చర్యం, అయోమయం. 'చెప్పు తల్లీ' అన్నట్లు తలూపాడు. ఆ మాత్రానికే ఆమె ముఖం వెలిగిపోయింది.

"నాన్న జ్ఞాపకాలతో ముడిపడి ఉన్న ఇంటిని పడగొట్టేస్తున్నారని విన్నాను. కానీ పడగొట్టే ముందు మా ఇంటిని ఒకసారి చూడాలనీ అక్కడ నాన్న జ్ఞాపకాలు నెమరు వేసుకోవాలనీ తెగ తహతహలాడుతున్నాను. మా ఇంటికి వెళ్ళి చూడ్డానికి మా అన్నలు ఒప్పుకోరని తెలుసు. వాళ్ళకి తెలియకుండా నేను ఆ ఇంట్లో కాసేపు గడపటానికి అవకాశం కల్పించవా?" అని అడగ్గానే రిలీఫ్ వచ్చినట్లు ఫీల్ అయ్యాడతను.

"అంతేనా తల్లీ... ఇంకేదోనని భయపడ్డాను" అన్నాడు చిన్నగా నవ్వుతూ. ఆ మాట వినగానే, ఆమె కనుబొమలు ముడివడ్డాయి.

"ఏం అడుగుతానని అనుకున్నావు?" అని ప్రశ్నించింది. ఆ ప్రశ్నకు అతను తడుముకున్నాడు. వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు.

"ఆస్తిలో వాటా అడుగుతావేమో, మీ అన్నలు నా మాట వింటారా అని..." అతనలా అంటుండగానే అడ్డుపడింది.

"బాబాయ్... నువ్వు నన్ను ఇంతేనా అర్థం చేసుకున్నది? నేను చాలా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మాట వాస్తవమే. శ్రీకర్ ఉద్యోగం వదిలేయడం వల్ల మరింత ఇబ్బంది పడుతున్నదీ నిజమే. కానీ నా ఆత్మగౌరవాన్ని చంపుకుని దిగజారతానని ఎలా అనుకున్నావు?" అంటూ ఆవేదనగా అడుగుతున్న అవనిని దిగ్భ్రమతో చూస్తూ ఉండిపోయాడు కాసేపు.

"అయ్యో తల్లీ... నా ఉద్దేశం అదికాదమ్మా ఆస్తిలో వాటా నీ హక్కు. అందుకే..."

"ఎప్పుడయితే నాన్న మాటనూ నాన్ననూ కాదనుకుని ఆ ఇల్లు వదిలేసి వచ్చానో, అప్పుడే నా హక్కు కోల్పోయాను. ఇప్పుడు అదంతా ఎందుకులే... నేను అడిగిన కోరిక నెరవేరుస్తావు కదూ" ఆశగా అడుగుతున్న అవని తలపైన చేయివేసి,

"నువ్వేమీ దిగులుపడకు. మీ అన్నలకు తెలియకుండా ఆ ఏర్పాటు చేస్తాను" అని అభయం ఇచ్చేసరికి అవని తృప్తిగా నవ్వింది.

❖ ❖ ❖

పదేళ్ళ తర్వాత- తాను పుట్టి పెరిగిన ఇంటి ముందు నిలబడింది. ఏదో తెలియని ఉద్వేగం ఆవహించింది ఆమెను. తన ప్రమేయం లేకుండానే ఒళ్ళంతా కంపించడం మొదలైంది. తనని తాను సంబాళించుకోవడానికి కాస్త సమయం పట్టింది. ఆ తర్వాత నెమ్మదిగా ఇంట్లో ప్రవేశించింది. ఇంట్లో అడుగడుగునా తండ్రి జ్ఞాపకాలే.

హాల్లోకి అడుగుపెట్టగానే తండ్రి టేబులు, కుర్చీ దర్శనమిచ్చాయి. నగిషీలు చెక్కిన రోజ్ వుడ్ కుర్చీలో కూర్చుని ఏవో పేపర్లు చూసుకుంటున్న తండ్రి తలెత్తి, తననే చూస్తున్నట్లు అనిపించింది. దీర్ఘంగా నిట్టూర్చి ముందుకు నడిచింది.

బాగా దుమ్ము పట్టేసి ఉన్న నాన్న ఫొటో చూడగానే ఆమె మనసు కలుక్కుమంది. దొరికిన గుడ్డతో తుడిచింది. ఆ ఫొటోని చూస్తుంటే నాన్నే తన ఎదురుగా నిలబడి ఉన్నట్లు అనిపించింది. ఆమె మనసు బాధతో మూలిగింది.

తండ్రి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళగానే ఎన్నో జ్ఞాపకాలు. నాన్న గుండెల మీద పడుకుని హాయిగా నిద్రపోయిన రోజులు గుర్తొచ్చి మనసంతా ఏదోలా అయిపోయింది. తండ్రి జ్ఞాపకాలతో బరువెక్కిపోయిన గుండె, ఆ భారాన్ని భరించలేక అల్లాడిపోతున్నట్లు అనిపించింది. తన్నుకొస్తున్న దుఃఖాన్ని అదుపు చేయలేక సతమతమైపోతున్న అవని భుజం మీద ఒక చేయి పడగానే, ఒక్కసారిగా ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది.

అనంతం ఆమె వెనకే నిలబడి ఉన్నాడు. తన్నుకొస్తున్న దుఃఖానికి ఆనకట్ట వేయలేకపోతున్న అవని పరిస్థితి చూసి, అతని కళ్ళమ్మట నీళ్లు జలజల రాలాయి.

“ముందే అనుకున్నాను తల్లీ. ఈ ఇంట్లో అడుగు పెట్టిన క్షణం నుంచీ నువ్వు కుమిలిపోతూ ఉంటావని. పద, పద. తొందరగా ఇల్లంతా ఒకసారి కలయదిరిగేయి. నువ్వు ఇక్కడ ఉన్నట్లు తెలిస్తే మీ అన్నా వదినలు చేసే రాద్ధాంతాన్ని భరించలేవు” అన్నాడు.

“అలాగే బాబాయ్, ఏదో నా తృప్తి కోసం ఇక్కడికి వచ్చాను. ఇక్కడి నుంచి ఏదయినా తీసుకుపోవాలన్న కోరికేదీ లేదు నాకు. వాళ్ళేవో ఊహించుకుని అనవసరంగా భయపడుతున్నారు. కాకపోతే, నాన్న గుర్తుగా ఏదైనా ఒక వస్తువు ఇస్తే తీసుకెళ్దామని మాత్రం ఆశగా ఉంది. వాళ్ళకు అవసరం లేనిది ఏదైనా ఇస్తారేమో అడగవా” అంటూ బాబాయ్ చేతులు పట్టుకుని అర్థించింది.

❖ ❖ ❖

అనంతం- పరశురామ్ కొడుకుల ముందు ఇబ్బందిగా కూర్చున్నాడు. అతను ఏదో అడగాలని అనుకుంటున్నాడని వాళ్ళకు అర్థం అయింది.

“చెప్పు బాబాయ్, ఏదో అడగాలని వచ్చినట్లున్నావు?” అన్నాడు పరశురాం పెద్దకొడుకు పార్థు.

“మీ చెల్లికి ఒక కోరిక ఉందిరా?” అంటూ సందేహిస్తూ ఆగాడు అనంతం.

“ఆస్తిలో వాటా కావాలా?” వెటకారంగా అడిగాడు రెండో కొడుకు కిషోర్.

“అబ్బే, అదేం లేదు. చిన్న కోరిక అంతే. మీ నాన్న జ్ఞాపకార్థం ఏదయినా వస్తువు ఇమ్మని అడిగింది” అన్నాడు అనంతం.

“పూచిక పుల్ల కూడా ఇవ్వం” మహాభారతంలో దుర్యోధనుడు అన్నట్లు ఇంతెత్తున లేచాడు కిషోర్. తమ్ముడిని శాంతపరచి, పెద్ద ధర్మమూర్తిలా పోజు పెడుతూ,

“అంత కావాలంటే నాన్న టేబుల్, కుర్చీ తీసుకెళ్ళమను” అన్నాడు పార్థు. కిషోర్ అడ్డు చెప్పబోయి ఆగిపోయాడు. దానికి కారణం అనంతంకి బాగా తెలుసు. అవి బాగా పాతబడిపోయాయి. కాళ్ళన్నీ



లూజు అయిపోయి, బాగా దెబ్బతిని, వాడుకోడానికి అనువుగా లేవు. అందుకే కిషోర్ అడ్డు చెప్పలేదు. చేసేదేమీ లేక తన సమ్మతిని తెలియజేస్తూ తలాడించాడు అనంతం.

❖ ❖ ❖

వారం రోజుల తర్వాత అనంతమే ఆ టేబుల్‌నూ కుర్చీనీ అవని ఇంటికి తీసుకువచ్చాడు. వాటిని ముట్టుకోగానే ఆమెకు ఒక్కసారిగా దుఃఖం ముంచుకొచ్చింది. గుడ్డతో శుభ్రంగా తుడిచింది. ఆ రెండిటితో ఆమెకు ఎంతో అనుబంధం ఉంది. వాటితో ముడిపడిన జ్ఞాపకాలెన్నో ఉన్నాయి. పరశురాం ఎక్కువసేపు ఆ కుర్చీలోనే కూర్చుని, టేబుల్ మీదున్న కాగితాలనో న్యూస్‌పేపర్‌నో చదువుతూ ఉండేవాడు. అక్కడే, అప్పుడప్పుడూ మంచి కవితలు రాసి, అవనికి వినిపిస్తూ ఉండేవాడు. అవనికి కూడా అక్కడ గడపడమే ఇష్టం. చిన్నప్పుడు తండ్రి, తనను ఆ టేబుల్ మీదే కూర్చోబెట్టి, అన్నం, టిఫిన్ తినిపించిన రోజులు గుర్తొచ్చి, ఆమె మనసు బాధతో మూలిగింది.

స్కూల్లో చదువుతున్నపుడుగానీ కాలేజీలో చదువుతున్నపుడుగానీ నాన్న పక్కనే కూర్చుని, ఆ టేబుల్ మీదే తన పనులన్నీ పూర్తి చేసుకునేది. అందుకే ప్రాణం లేనివయినా ఆ కుర్చీ, ఆ టేబుల్ ఆమె జీవితంలో ముఖ్య భాగమయ్యాయి. ఆమెకు అపురూపమైన కానుకలు అయ్యాయి.

శ్రీకర్, ఏ సహాయం చేయకుండా నిర్వికారంగా చూస్తున్నాడు. అతని ముఖంలో కాసింత అసహనం కనబడుతోంది. తనను కాదన్నాడని మామగారంటే అతనికి ఇప్పటికీ కోపమే.

“చూడండిరా... మీ మావయ్యలు, మీ అమ్మకు ప్రేమతో ‘సారె’ పంపారు” అని పిల్లలతో వెటకారంగా అంటూ తన అక్కసును తీర్చుకుని, అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

అవని అదేమీ పట్టించుకోకుండా కార్పెంటర్‌ని పిలిచి, వాటిని బాగు చేయించి, పాలిష్ పెట్టించి, కొత్త వాటిలా తయారు చేయించే పనిలో పడింది.

❖ ❖ ❖

మర్నాడు ఇంట్లో ప్రవేశించిన అనంతం తను తెచ్చిన ఫర్నిచర్ వైపు ఆశ్చర్యంగా చూశాడు. ఆ టేబుల్‌కీ కుర్చీకీ కొత్త రూపు వచ్చింది.

“అమ్మగారూ... ఈ సొరుగు తాళం మీ దగ్గర ఉందా?” అని అడిగాడు కార్పెంటర్. లేదన్నట్లు అడ్డంగా తలాడించి, అనంతం వైపు చూసింది. తన దగ్గర కూడా లేదన్నట్లు అడ్డంగా తలూపాడతను.

“మరి తాళం పగలకొట్టేయనా? కొత్తది వేసుకోవచ్చు” అంటూ అవని అనుమతి కోసం చూశాడు. ‘సరే’నన్నట్లు అన్యమనస్కంగా తలాడించిందామె. తాళం పగలకొట్టి సొరుగు బయటకు లాగగానే, దాని నుంచి ఒక బ్రౌన్ రంగు కవరు బయటపడింది. కార్పెంటర్ ఆ కవర్ ఆమెకు అందించాడు. అయోమయంగా చూస్తూ వణికే చేతులతో అందుకుంది. అనంతం కుతూహలంగా చూస్తూ ముందుకు వంగాడు. అందులో ఉన్న వీలునామా చూడగానే ఆమెకు మతిపోయింది... ఇల్లు అవనికే చెందేటట్లు పరశురామ్ రాసిన వీలునామా అది! ★

పచ్చడి... పట్టుపట్టేద్దామా!

నోరూరించే వంటకాలు ఎన్నైనా ఉండనీయండి... మొదటి ముద్ద పచ్చడితోనే అని పట్టుపట్టే వాళ్లుంటారు. కాస్త పుల్లగా, కాస్త కారంగా... 'ఆహా' అనిపిస్తూ స్వర్గం అంచులకు తీసుకెళ్లే పచ్చడంటే ఇష్టం లేనిదెవరికి చెప్పండి! మరి ఈ సీజన్‌లో దొరికే పదార్థాలతో ఏ పచ్చళ్లు చేయగలమో చూసేద్దామా!

గోంగూర- దోసకాయతో...



కావలసినవి: దోసకాయ: ఒకటి చిన్నది, **గోంగూర ఆకులు:** పెద్ద కప్పు, **చింతపండు:** కొద్దిగా, **ఉల్లిపాయ:** ఒకటి, **పచ్చిమిర్చి:** ఆరు, **ఎండుమిర్చి:** ఎనిమిది, **ఆవాలు:** అరచెంచా, **మెంతులు:** అరచెంచా, **జీలకర్ర:** అరచెంచా, **ఇంగువ:** చిటికెడు, **వెల్లుల్లి రెబ్బలు:** అయిదు, **నూనె:** నాలుగు టేబుల్‌స్పూన్లు, **ఉప్పు:** తగినంత.

తయారీ విధానం: దోసకాయ చెక్కు తీసి చిన్నచిన్న ముక్కల్లా కోసుకోవాలి. గోంగూరను కడిగి పెట్టుకోవాలి. స్టవ్‌మీద కడాయిని పెట్టి మెంతులు, జీలకర్ర, ఆవాల్ని వేయించుకుని విడిగా తీసుకోవాలి. అదే కడాయిలో చెంచా నూనె వేసి ఎండుమిర్చి, పచ్చిమిర్చి, చింతపండును వేసి దోరగా వేయించి తీసుకోవాలి. ఇప్పుడు మిగిలిన నూనె వేసి ఇంగువ, గోంగూర వేసి ఆకుల్ని వార్చుకోవాలి. ఈలోగా వేయించుకున్న పదార్థాలూ, వెల్లుల్లి రెబ్బలూ, తగినంత ఉప్పును మిక్సీలో వేసుకుని మెత్తగా చేసుకోవాలి. ఇందులో వార్చుకున్న గోంగూర, సగం దోసకాయ ముక్కలు వేసుకుని బరకగా మిక్సీ పట్టుకుని ఓ గిన్నెలోకి తీసుకోవాలి. చివరగా మిగిలిన దోసకాయ ముక్కలు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసుకుని అన్నింటినీ కలిపితే నోరూరించే పచ్చడి రెడీ.

ఉసిరికాయ టొమాటో పచ్చడి



కావలసినవి: ఉసిరికాయలు: ఆరు, టొమాటోలు: మూడు, పచ్చిమిర్చి: పదిహేను, నూనె: మూడు టేబుల్‌స్పూన్లు, మెంతులు: పావు చెంచా, దనియాలు: రెండు చెంచాలు, ఆవాలు: చెంచా, జీలకర్ర: చెంచా, నువ్వులు: రెండు టేబుల్‌స్పూన్లు, పసుపు: అరచెంచా, ఉప్పు: తగినంత, ఎండుమిర్చి: రెండు, కరివేపాకు రెబ్బలు: రెండు, వెల్లుల్లి రెబ్బలు: మూడు, తాలింపు దినుసులు: చెంచా.

తయారీ విధానం: స్టవ్‌మీద కడాయిని పెట్టి చెంచా నూనె వేసి మెంతులు, దనియాలు, ఆవాలు, జీలకర్ర వేయించుకుని నువ్వులు, పచ్చిమిర్చి వేయాలి. అయిదు నిమిషాలయ్యాక ఈ మిశ్రమాన్ని మిక్సీలో వేసుకోవాలి. అదే కడాయిలో చెంచా నూనె వేసి టొమాటో ముక్కలు, ఉసిరికాయముక్కలు, తగినంత ఉప్పు, పసుపు వేసి కలిపి మూత పెట్టాలి. ఈ ముక్కలు మగ్గాక స్టవ్ కట్టేయాలి. వేడి కాస్త చల్లారాక ఈ ముక్కల్ని కూడా మిక్సీలో వేసుకుని మెత్తగా చేసుకోవాలి. చివరగా స్టవ్‌మీద కడాయిని పెట్టి మిగిలిన నూనెవేసి ఎండుమిర్చి, తాలింపు దినుసులు, కరివేపాకు, వెల్లుల్లి రెబ్బలూ వేయించుకుని పచ్చడిలో కలిపితే... పుల్లపుల్లని ఉసిరికాయ టొమాటో పచ్చడి తినడమే ఆలస్యం.

చింతకాయ- నువ్వుల పచ్చడి

కావలసినవి: చింతకాయలు: పావుకేజీ, పచ్చిమిర్చి: పావుకేజీ, **నువ్వులు:** మూడు టేబుల్‌స్పూన్లు, **జీలకర్ర:** చెంచా, **మెంతులు:** అరచెంచా, **వెల్లుల్లిపాయలు:** రెండు(పొట్టు తీసి రెబ్బలని శుభ్రం చేసి పెట్టుకోవాలి), **ఉప్పు:** మూడు చెంచాలు, **నూనె:** పావుకప్పు, **తాలింపు దినుసులు:** టేబుల్‌స్పూను, **వెల్లుల్లి రెబ్బలు:** మూడు.

తయారీ విధానం: చింతకాయలని ఉడికించుకుని చల్లార్చి చిక్కని రసం తీసి పెట్టుకోవాలి. పచ్చిమిరపకాయల్లో సగం పోపులో వేయడం కోసం తీసుకుని వాటిని నిలువుగా చీల్చుకోవాలి. స్టవ్ వెలిగించి, కడాయిలో నువ్వులని దోరగా వేయించుకోవాలి. అవి పక్కన పెట్టుకుని, అదే కడాయిలో జీలకర్రా, మెంతులూ వేయించుకోవాలి. మిక్సీలో వేయించిన జీలకర్ర, మెంతులు, నువ్వులు, పచ్చిమిర్చి, ఉప్పు, వెల్లుల్లిరెబ్బలు వేసి అన్నింటినీ మెత్తగా మిక్సీ పట్టుకోవాలి. ఇందులోనే వడకట్టి పెట్టుకున్న చింతకాయల రసాన్ని కొద్దికొద్దిగా పోస్తూ మళ్లీ ఒకసారి మిక్సీ పట్టుకోవాలి. కడాయిలో నూనె వేసుకుని తాలింపు గింజలు వేసుకుని, చీల్చి పెట్టుకున్న పచ్చిమిర్చి, వెల్లుల్లి రెబ్బలు కూడా వేసి బాగా వేగాక మిక్సీ పట్టుకున్న చింతకాయలు-నువ్వుల మిశ్రమం వేసి నూనెపైకి తేలేంతవరకూ ఉడికించాలి. ఈ పచ్చడి రెండువారాలపైనే నిల్వ ఉంటుంది. ఒక్కరోజు ఆగి తింటే ఇంకా బాగుంటుంది.





పచ్చళ్లంటే ఇష్టం!

- ప్రియాంక చోప్రా

సెలబ్రిటీ స్పెషల్



ప్రపంచమంతా తిరిగినా... నాకు భారతీయ వంటకాలే నచ్చుతాయి. అందులోనూ పచ్చళ్లంటే మహా ఇష్టం. అన్నం, పప్పులోకి ఏదో ఒక పచ్చడి కూడా తోడైతే ఆ రుచే అద్భుతం. నాకు చాలా రకాల పచ్చళ్లు చేయడం వచ్చు కానీ సింపుల్‌గా, నోటికి రుచిగా చేసే ఉల్లిపాయ పచ్చడి అంటే మాత్రం మహా ఇష్టం. అదెలా చేయాలంటే... మూడు ఉల్లిపాయలని నిలువుగా సన్నగా తరిగి పెట్టుకోవాలి. అలాగే నిలువుగా తరిగిన నాలుగు పచ్చిమిర్చీ, దంచిన సోంపుపొడి రెండు చెంచాలు, ఆమ్‌చూర్ పొడి చెంచా, పసుపు అరచెంచా, కశ్మీర్‌కారం చెంచా, చాట్‌మసాలా చెంచా, ఇంగువ అరచెంచా, ఉప్పు తగినంత తీసుకోవాలి. ఇంగువ తప్ప మిగిలినవాటిని ఒక గిన్నెలోకి తీసుకుని బాగా కలుపుకోవాలి. దీనికి మామూలు నూనెతో కన్నా ఆవనూనెలో ఇంగువ వేసి, కాసిని రెబ్బలతో తాలింపు పెట్టుకుంటే అదిరిపోతుంది. చివరగా అరచెక్క నిమ్మరసం పిండుకున్నారంటే స్వర్గం ఎక్కడో ఉండదు. నేనైతే చైనీస్ వంటకాలని కూడా ఈ ఉల్లిపాయ పచ్చడితో తినేస్తా... అంత ఇష్టం నాకు!


చెప్పగలరా?

అమ్మ మిషన్ కుడుతుంటే... పాప సాయం చేస్తోంది కదూ! ఈ బొమ్మలో ఆంగ్ల అక్షరం 'S'తో మొదలయ్యే కొన్ని వస్తువులు దాగున్నాయి. అవేంటో కనిపెట్టగలరా?



దారి కనుక్కోండి

బుజ్జి కుందేలు పొదల్లో చిక్కుకుపోవడంతో దాన్నెలా రక్షించాలో తల్లికి తెలియడం లేదు. మీరు కాస్త దారి చూపి సాయం చేయరూ!




అవేంటబ్బా?


మేము రెండు వేర్వేరు ఆహార పదార్థాలం. కానీ, మీరు ఒకే మోతాదులో కొంటారు. మాలో ఒకరిని పగలగొడితే కానీ వాడలేరు... ఇంకొకరిదేమో తొక్క తీస్తే కానీ తినలేరు. ఇంతకీ మేమెవరం?

ఏ అక్షరం?

ఇక్కడి రంగుల వృత్తాలూ, వాటి మధ్యలోని అక్షరాలను బాగా గమనించి, ప్రశ్నార్థకం స్థానంలో రావాల్సిన అక్షరమేంటో చెప్పండి చూద్దాం.



బొమ్మ గీద్దాం



తేడాలేంటి?

కింది బొమ్మల మధ్య ఎనిమిది తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి.






తప్పులే తప్పులు

పిల్లలందరూ వర్షంలో ఆడుకుంటున్నారు కదూ! ఈ బొమ్మలో అయిదు తప్పులున్నాయి. అవేంటో కనిపెట్టండి చూద్దాం.



అవి ఏవి?

ఇక్కడున్న స్నోమ్యాన్ బొమ్మల్లో రెండు మాత్రమే ఒకేలా ఉన్నాయి. ఆ రెండూ ఏవో చెప్పగలరా?



దేవుడి కంటే గొప్ప!

ఒకరోజు సభలో రాజ్య ప్రజల క్షేమ సమాచారాలను తెలుసుకుంటున్నాడు అక్బర్. చాలారోజులు కావడంతో ఒకసారి బీర్బల్ తెలివితేటలను పరీక్షించాలనుకున్నాడు. 'నేను గొప్పా? దేవుడు గొప్పా?' అని అడిగాడు. 'మీరే గొప్ప' అని క్షణం కూడా ఆలోచించకుండా చెప్పాడు బీర్బల్. 'అదెలా?' అని అక్బర్ అడగ్గా... 'దేవుడు కూడా చెయ్యలేని ఒక పనిని మీరు చెయ్యగలరు' అని సమాధానమిచ్చాడు బీర్బల్. 'నీకేమైనా పిచ్చా? దేవుడొక పని చెయ్యలేడనీ, అది నేను చెయ్యగలననీ నువ్వు నిజంగా నమ్ముతున్నావా?' అని ప్రశ్నించాడు అక్బర్. 'అవును మహారాజా' అన్నాడు బీర్బల్.



ఇంతలో 'దేవుడు చెయ్యలేని పనంటూ లేదు' అన్నాడో సభికుడు. 'ఉంది' అంటూ రెట్టించాడు బీర్బల్. 'ఒకవేళ ఉంటే అది చాలా చెడ్డ పని' అన్నాడతను. 'అంటే... మన రాజు గారు చెడ్డ పనులు చేస్తారని మీ ఉద్దేశమా?' అని ఆ సభికుడిని ప్రశ్నించాడు బీర్బల్. పాదుషా ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందేమోనని సభికుడు కంగారుపడుతూ... 'మహారాజా... నా ఉద్దేశం అది కాదు... క్షమించాలి' అన్నాడు. అక్బర్ చిరాకుపడుతూ... 'బీర్బల్... ఇంకా నాన్చకుండా ఆ ఒక్క పనేంటో త్వరగా చెప్పు' అన్నాడు. 'అవసరమైతే మీరు ఏ మనిషికైనా యావజ్జీవ దేశ బహిష్కార శిక్ష విధించగలరా లేదా?' అడిగాడు బీర్బల్. 'తప్పకుండా విధించగలను. పెద్ద నేరం చేసిన వాళ్లను నిస్సంకోచంగా దేశ బహిష్కరణ చేస్తా' జవాబిచ్చాడు అక్బర్. 'మరి... దేవుడు కావాలన్నా అలాంటి శిక్షను ఎవరికీ విధించలేడు కదా' అన్నాడు బీర్బల్. 'ఎందుకు?' అని పాదుషా అడగ్గా... 'ఎందుకంటే... విశ్వమంతా దేవుడిదే గనక... ఆయన అధికారం చెలామణీ కాని చోటంటూ లేదు గనక... ఒకవేళ బహిష్కరించినా ఆ వ్యక్తిని ఎక్కడికి పంపాలో దేవుడికి తెలీదు గనక... కానీ, ఆ పనిని మీరు తేలిగ్గా చెయ్యగలరు' వివరించాడు బీర్బల్. బీర్బల్ చతురతకు సంతోషించిన అక్బర్... ఖరీదైన బహుమతులు అందించి సత్కరించాడు.

రంగులేద్దాం



జవాబులు

తేడాలేంటి?: 1. కోతి తోక 2. పండ్ల బుట్ట స్థానం 3. ఎలుక దిశ 4. గొడుగు రంగులు 5. పక్షుల సంఖ్య 6. బాబు టోపీ 7. చిన్న బండరాయి 8. పాప హెయిర్ బ్యాండ్.

తప్పులే తప్పులు: 1. పిల్లికి కుచ్చు తోక 2. సైకిల్‌కి ఒకవైపే పెడల్ ఉంది 3. చెట్టుకి పుచ్చకాయలు కాయడం 4. బాబు ప్యాంట్ 5. పాప వేర్వేరు రంగు బూట్లు వేసుకుంది.

అవి ఏవి?: 4, 5

చెప్పగలరా?: Stool, Scissors, Sofa, Socks, Scooter, Ship, Seven, Shoes.


ఏ అక్షరం?: D (వృత్తాల్లోని రంగుల ఆధారంగా...)

అవేంటబ్బా?: కోడిగుడ్లు, అరటిపళ్లు.

సమీక్ష


అచ్చమైన జీవితం

'సొంతంగా రాయడం కన్నా అనువాదం నాలుగింతలు కష్టం'... అంటారు కొడవటిగంటి కుటుంబరావు. ఆ కష్టాన్ని ఇష్టంగా తలకెత్తుకుని, పాఠకాదరణ పొందిన తమిళ కథల్ని పొందికగా తెలుగులోకి తర్జుమా చేశారు శ్రీనివాస్. ఏ భాషలో రాసినా, జీవితాలు జీవితాలే! నరేన్ 'కేశం' కథలో అత్తియప్పన్‌ను వేధించే చర్మవ్యాధి... మనిషిలోని ఉద్వేగాలకు ప్రతీక. మానవ సంబంధాల్లోని సంక్లిష్టతను వివరించడానికి రచయిత ఈ వినూత్న వస్తువును ఎంచుకున్నారు. సెందిల్ జగన్నాథన్ 'అనాహత నాదం' స్వామినాథన్ అనే నాదస్వర వాద్యకారుడి బతుకు కథ. నాదస్వరం మీద పట్టుసాధించడం అసాధ్యమని అర్థమైపోయిన తర్వాత, ఇక వాద్య పరికరాన్ని వదిలించుకోవాలని నిర్ణయించుకుంటాడు స్వామి. సరిగ్గా అప్పుడే, సంగీత సరస్వతి అతణ్ని కరుణించడం కొసమెరుపు. మిగిలిన పదమూడు కథల్లోనూ ఏదో ఓ జీవన సత్యం గోచరం అవుతుంది.



అక్రమ తుపాకులు
(తమిళ అనువాద కథలు)
అనువాదం: శ్రీనివాస్ తెప్పల
పేజీలు: 181, **వెల:** రూ.250
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.


హైదరాబాద్ కతలు



మనుషుల కథల్లాంటివే వీధుల గాథలూ. అందులోనూ నాయకులూ ప్రతినాయకులూ ఉంటారు. కొసమెరుపులు తళుక్కుమంటాయి. పరవస్తు లోకేశ్వర్ 'షహర్ నామా' హైదరాబాద్‌లోని వీధుల గాథల సమాహారం. ఈ మహానగరం చుట్టూ ఎంత చరిత్ర ఉందో, అంత కల్పనా ముడిపడి ఉంది. కాలయంత్రంలో ఎక్కించుకుని, గోల్కొండ కోట మంగళాపురంగా చెలామణి అయిన రోజుల్లోకి మనల్ని తీసుకెళ్తారు రచయిత. మొగల్‌పురాలోని మాతా మహంకాళిని శివాజీ మహారాజు పూజించినప్పటి గాథను ఆసక్తికరంగా వివరిస్తారు. నిజాం తొత్తుల చేతిలో వీరమరణం పొందిన షోయబుల్లాఖాన్ గురించే మనకు తెలుసు. నిండుచూలాలైన అతని ఇల్లాలికి పురుడుపోసిన హెడా దంపతుల కథా స్ఫూర్తిదాయకమే.

షహర్ నామా
రచన: పరవస్తు లోకేశ్వర్
పేజీలు: 190, **వెల:** రూ.200
ప్రతులకు: ఫోన్: 9381559238


చలో... పాండీబజార్!



చెన్నైలోని పాండీబజార్ వర్ధమాన తారల... కలల కల్యాణ మండపం! వెండితెర మీద ఓ వెలుగు వెలగాలని వచ్చిన కుర్రాళ్లు, అప్పటికే వెలగాల్సినంత వెలిగి కొండెక్కడానికి సిద్ధంగా ఉన్న వృద్ధ నటులూ, నాలుగు మాటల్ని నమ్ముకుని ముప్పూటలా కడుపు నింపుకునే లౌక్యం తెలిసిన మనుషులూ, సకల ప్రయత్నాలూ విఫలమైన తర్వాత జీవితంతో రాజీ పడిపోయి ఏ టీకొట్టో పెట్టుకుని బతుకును వెళ్లదీసే వాస్తవికవాదులూ... ఇలా సకల సినీజనుల చౌరస్తా చుట్టూ గేయ రచయిత భువనచంద్ర 'పాండీబజార్ కథలు' ప్రదక్షిణలు చేస్తాయి. అక్కడి పార్కులూ, హోటళ్లూ, ఫుట్‌పాత్‌లూ, సినిమా ఆఫీసులూ అనేక పరిణామాలకు సాక్ష్యంగా నిలుస్తాయి. కొన్ని విషాదాలకు ఆనవాళ్లూ అవుతాయి.

పాండీబజార్ కథలు
రచన: భువనచంద్ర
పేజీలు: 112, **వెల:** రూ.120
ప్రతులకు: ఫోన్: 8558899478

అద్దంలో సమాజం



ఈ కథల్లో పేదల బతుకులు ఉన్నాయి. రైతుల కష్టాలు పలకరిస్తాయి. మధ్యతరగతి వైఫల్యసాఫల్యాలూ పరామర్శిస్తాయి. 'మనుగడ' పేరుతో రచయిత సింహప్రసాద్ వెలువరించిన ప్రస్తుత సంకలనం జీవితంలోని అన్ని కోణాలనూ, సమాజంలోని అన్ని పార్శ్వాలనూ తడిమింది. 'గమ్యం-గమనం'లో నలుగురు వయోధికుల జీవనయానాన్ని ఓచోట గుదిగుచ్చారు. కలకత్తాలో ఓ జూనియర్ డాక్టర్ మీద జరిగిన వికృత దాడి 'తీర్పు' కథకు ఇతివృత్తం. 'ఒక్క అడుగు' ప్రకృతిని ఛిద్రం చేస్తున్న మనిషి స్వార్థాన్ని ప్రశ్నిస్తుంది. 'కొక్కొరొకో' కథకు పౌల్ట్రీ పరిశ్రమ కష్టనష్టాలను ఆధారంగా తీసుకున్నారు.

మనుగడ (కథలు)
రచన: సింహప్రసాద్
పేజీలు:188; **వెల:** రూ.150
ప్రతులకు: ఫోన్: 9849061668

బుక్‌షెల్ఫ్

భగవద్గీత (తాత్పర్యం తేలిక భాషలో)
రచన: మల్లాది వెంకటకృష్ణమూర్తి
పేజీలు: 167, వెల: రూ.100
ప్రతులకు: ఫోన్: 9885110110

వ్యాస మందారం
రచన: డా. బొడ్డుపల్లి కాళిదాసు
పేజీలు: 166, వెల: రూ.100
ప్రతులకు: ఫోన్: 9652808040

శూన్యం (కవిత్వం); రచన: ఫిజిక్స్ అరుణ్ కుమార్
పేజీలు: 140, వెల: రూ.220; ప్రతులకు: ఫోన్: 9491378313

బుద్ధారం చరిత్ర-సంస్కృతి; రచన: హెచ్. రమేష్‌బాబు
పేజీలు: 312, వెల: రూ.300; ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

అంతరిక్ష యాత్ర (అన్వేషణాత్మక నవల); రచన: రమణశ్రీ
పేజీలు: 172, వెల: రూ.150; ప్రతులకు: ఫోన్: 8522002536

విశిష్ట తెలుగు దిగ్దర్శనం; సంపాదకులు: డా. తూమాటి సంజీవరావు
పేజీలు: 366, వెల: రూ.500; ప్రతులకు: ఫోన్: 9884446208

మనోవిహారి; ఆంగ్లమూలం: దినకరరావు పసుపులేటి
తెలుగుసేత: కస్తూరి రాజశేఖర్
పేజీలు: 127, వెల: రూ.100; ప్రతులకు: ఫోన్: 9849330930

మా అమెరికా పర్యటన
(కవితలు-వాస్తవికతలు)
పేజీలు: 144, వెల: రూ.150

విశ్వ నియమాలు... విశ్వ రహస్యాలు
పేజీలు: 369, వెల: రూ.500
రచన: డా. లక్కరాజు నిర్మల
ప్రతులకు: ఫోన్: 9949299618

కంచెలపై దేహాలు
రచన: బ్రహ్మప్రకాష్
అనువాదం: కె. ఉషారాణి
పేజీలు: 183, వెల: రూ.190
ప్రతులకు: ఫోన్: 9490099373

రాశి ఫలం

గ్రహబలం
(నవంబరు 9 - 15)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి





మేషం
అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

కృషిని బట్టి ఫలితం ఉంటుంది. చక్కని ప్రణాళికతో విజయాలు సాధిస్తారు. ప్రారంభించిన పనుల్ని సకాలంలో పూర్తి చేస్తారు. వివాదాస్పద వ్యవహారాల్లో జోక్యం చేసుకోకండి. కొందరి ప్రవర్తన ఇబ్బంది కలిగిస్తుంది. వ్యాపార నిర్ణయాల్లో పరాధీనత వద్దు. ఉద్యోగంలో ఒత్తిడి పెరిగే ఆస్కారం ఉంది. నవగ్రహాలను ధ్యానించండి.



వృషభం
కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఉద్యోగ ఫలితాలు బావుంటాయి. పదవీయోగం ఉంది. లక్ష్యం దిశగా మీ ప్రయత్నాల్ని ముమ్మరం చేయండి. భవిష్యత్తు శుభప్రదంగా ఉంటుంది. పనులు వాయిదా వేయకండి. గృహ నిర్మాణం విషయంలో జాగ్రత్త. కొన్ని సంఘటనలు ఒత్తిడికి గురిచేస్తాయి. మానసిక ప్రశాంతత అవసరం. దుర్గామాతను పూజించండి.



మిథునం
మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

శుభాలు జరుగుతాయి. వ్యాపారయోగం ఉంది. స్వల్ప ప్రయత్నంతోనే విజయాలు సాధిస్తారు. సృజనాత్మక మార్గాల్లో సమస్యల్ని పరిష్కరిస్తారు. మీదైన ప్రతిభతో సమాజంలో గుర్తింపును తెచ్చుకుంటారు. వృత్తి ఉద్యోగాల్లోని సవాళ్లను ప్రశాంత చిత్తంతో అధిగమిస్తారు. సరైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవాలి. దైవబలం అండగా నిలుస్తుంది. లక్ష్మీ అష్టోత్తరం పఠించండి.



కర్కాటకం
పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

ధనయోగం ఉంది. ఆదాయ మార్గాల్ని పెంచుకుంటారు. గతంలోని పెట్టుబడులు లాభాలను కురిపిస్తాయి. పొదుపు-మదుపు ప్రణాళికలు రచించుకోండి. ముఖ్య నిర్ణయాల్లో ఆత్మీయులను భాగం చేయండి. సమయాన్ని సద్వినియోగం చేసుకోండి. వివాదాలకు దూరంగా ఉండండి. వ్యాపార లావాదేవీల్లో బుద్ధిబలం అవసరం. నవగ్రహ శ్లోకాలను చదువుకోండి.



సింహం
మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

విజయం వరిస్తుంది. ఉద్యోగంలో ఉత్తమ ఫలితాలు లభిస్తాయి. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పని పూర్తవుతుంది. భవిష్యత్తు శుభప్రదం. ఆదాయ మార్గాలు విస్తరిస్తాయి. కొందరి వల్ల ఇబ్బందులు ఎదురైనా, బుద్ధిబలంతో అధిగమిస్తారు. మీ ప్రతిభను సమాజం గుర్తిస్తుంది. మహాలక్ష్మిని ధ్యానించండి.



కన్య
ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

సకాలంలో పనుల్ని ప్రారంభించండి. ప్రయత్నాలు విజయవంతం అవుతాయి. జీవితాశయం నెరవేరుతుంది. ఉద్యోగంలో శుభ ఫలితాలు ఉంటాయి. అపార్థాలకు ఆస్కారం ఇవ్వకండి. ఆదాయ మార్గాలు విస్తరిస్తాయి. స్థిరచరాస్తులను వృద్ధి చేసుకుంటారు. వారాంతంలో ఓ శుభవార్త వింటారు. కనకధారాస్తోత్రం చదువుకోండి.



తుల
చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆరంభించిన పనులు విజయవంతంగా పూర్తవుతాయి. వ్యాపారం లాభదాయకం. బుద్ధిబలంతో విఘ్నాల నుంచి బయటపడతారు. కష్టాన్ని బట్టి ఫలితాలు ఉంటాయి. ముఖ్య వ్యవహారాల్లో స్థిరమైన నిర్ణయాలు తీసుకోండి. వివాదాలకు ఆస్కారం కల్పించకండి. ఓ మెట్టు దిగైనా సరే, అనుకున్న పనుల్ని పూర్తి చేస్తారు. సూర్యభగవానుడిని ధ్యానించండి.



వృశ్చికం
విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థికంగా కలిసొస్తుంది. సంపాదనను సద్వినియోగం చేసుకోండి. ఆస్తులు వృద్ధి చెందుతాయి. పెట్టుబడుల విషయంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. చిన్న పొరపాట్లు సైతం తీవ్ర నష్టాలకు కారణం కావచ్చు. వ్యాపారంలో కొత్త ప్రయోగాలకు సమయం కాదు. నలుగురితో సౌమ్యంగా సంభాషించండి. ఆదిత్య హృదయం పఠించండి.



ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ఉద్యోగులకు అనుకూలమైన సమయం. మీ కష్టాన్ని పెద్దలు గుర్తిస్తారు. అధికారుల ప్రశంసలు అందుకుంటారు. ఆర్థిక ఫలితాలు లాభదాయకంగా ఉంటాయి. పెట్టుబడులు లాభాలను కురిపిస్తాయి. గృహ నిర్మాణ ప్రయత్నంలో పురోగతి కనిపిస్తుంది. వారాంతంలో శుభవార్త వింటారు. విష్ణు సహస్రనామం పారాయణం చేయాలి.



మకరం
ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

మనోబలం ముందుకు నడిపిస్తుంది. ప్రారంభించిన పనులు పూర్తవుతాయి. ఉద్యోగులకు పదోన్నతి లభిస్తుంది. శత్రుదోషం తొలగుతుంది. వ్యాపారంలో లాభాలను అందుకుంటారు. ప్రయత్నాలు సఫలం అవుతాయి. అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలి. శుభవార్తలు వింటారు. మహాలక్ష్మిని అర్చించండి.



కుంభం
ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

ఆర్థికంగా అభివృద్ధిని సాధిస్తారు. కష్టానికి తగిన ప్రతిఫలం ఉంటుంది. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. కొన్ని విషయాల్లో లాభనష్టాలకు అతీతంగా పనిచేయాలి. సకాలంలో బాధ్యతల్ని నిర్వర్తించడం ద్వారా, ఒత్తిడిని అధిగమిస్తారు. కుటుంబ సభ్యులతో సంప్రదించాకే ముఖ్య నిర్ణయాలు తీసుకోండి. దైవబలం అండగా నిలుస్తుంది. నవగ్రహ శ్లోకాలను చదువుకోండి.



మీనం
పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఆర్థికంగా అనుకూలమైన సమయం. గతంలోని ప్రయత్నాలు కార్యరూపం ధరిస్తాయి. మొహమాటం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయి. రుణ సమస్యలకు ఆస్కారం కల్పించకండి. మీరు నమ్మిన ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది. ఉద్యోగులు బుద్ధిబలంతో సవాళ్లను అధిగమిస్తారు. ఓ శుభవార్త ఆనందాన్ని ఇస్తుంది. నవగ్రహ శ్లోకాలను చదువుకోండి.

పదకేళి

కూర్పు: బాలు

అడ్డం

1. భారతదేశం (3)
3. అభాండం, నింద (4)
6. పార్వతీదేవి (3)
8. గారెల కోసం వాడే పప్పు (4)
9. శివప్రియం, జప మాలలోని పూస (3)
10. అన్నవరం దగ్గరలోని ఓ పట్టణం (2)
11. ఆవు (2)
12. నెమ్మది; అనుకూలించు; నీళ్ళకుండ కింద 'మట్టు' (3)
13. వృద్ధాప్యం (2)
14. కాంతి (4)
16. కాలిపోవు, జ్వలించు (2)
17. ఫలాలు (2)
18. మనసు (2)
19. జింక (2)
20. ఉప్పు (3)
23. చతురంగ బలాలతో ఆడే ఆట... చెస్ (4)
25. కీడు (2)
26. బ్రహ్మ (3)
28. వాయువును (3)
29. ప్రతిమ (2)
30. అనుమానం (2)
32. కంఠం, స్వరం (2)
34. సవ్వడి, చప్పుడు (2)
36. నిలువు 27తో ప్రేమ (1)
37. ఆపద, సమస్య (3)
38. అనేక బాణాలను ఒక్కుమ్మడిగా ప్రయోగించినప్పుడు ఇలాగంటారు (6)
43. మంచి కవి (3)
44. చిరుచీకటి, కనిపించీ కనిపించని (3)
46. పాత రోజుల్లో నేరస్తుల మీద ఝుళిపించేది (3)
47. భల్లూకం (3)

1		2	■	3	4		5	■	6		7
	■	8				■	9			■	
■	10		■		■	11		■	12		
13		■	14		15		■	16		■	
	■	17		■		■	18		■	19	
20	21		■	22	■	23			24	■	
25		■	26		27	■		■	28		
	■	29		■	30	31	■	32		■	
■	33	■	34	35	■		■		■	36	■
37			■	38	39		40		41	■	42
■		■	43			■		■	44	45	
46			■		■	47			■		■

నిలువు

1. మగువ (2)
2. రాత్రి (3)
3. నూనెలో వేయిస్తే పప్పుచారులోకి బాగుంటాయి (4)
4. పసిపిల్లలకు అన్నంలో కలిపి పెట్టేది? (2)
5. లయబద్ధంగా చేత్తో చేసే శబ్దం (3)
6. భక్షించేవాడు, తిండిపోతు (4)
7. బూడిద కప్పేసిన అగ్గి (8)
10. ముగింపు (2)
11. నఖం (2)
13. ముత్యాలతో గుచ్చి మెడలో ధరించేది? (5)
14. పో! (2)
15. ఎక్కువ రోజులు వాడకపోతే ఇనుప వస్తువుల మీద పేరుకునే మకిలి (2)
16. నిలయం, నివేశనం (3)
17. పందెం, బెట్ (2)
18. ఊడుగు చెట్టు, ఉమ్మెత్త (3)
21. అడవి, వనం (2)
22. పాలించు (2)
24. నీటిని నిల్వ ఉంచే పెద్ద పాత్ర (3)
26. విశ్వసించరా (3)
27. హస్తగతం, స్వాధీనం (2)
31. చెక్క, కొయ్య (3)
32. ప్రవేశద్వారం కిందిభాగం (3)
33. పశ్చిమం (4)
35. మూల పురుషుడు, గోత్ర ప్రవరుడు (4)
39. సూర్యుడు (2)
40. చెక్కల్ని పరపరా కోసేవి (3)
41. లక్ష్మి (2)
42. వేడి, ఉష్ణం (2)
45. సమస్తం (2)

సుడొకు

3				1				
		1	5		4			3
	9	6	8			1	7	4
8					1			2
	5	9				8	3	
6			3					1
4	8	3			5	6	2	
2			9		3	4		
				2				8

గతవారం సమాధానాలు

పదకేళి

1 అ	తి	2 ప	■	3 అ	హ	ర్ని	4 శం	■	5 శి	వా	6 ని
ధ	■	7 ధ	8 రి	త్రి	■	■	9 క	10 మ	ల	■	రా
11 రం	12 భ	■	క్తం	■	13 వా	14 గు	■	హి	■	15 ఆ	శ
■	16 ర	శ్మి	■	17 నా	య	న	మ్మ	■	18 ప్రే	మ	■
19 పా	జీ	■	20 చం	■	21 సం	పం	■	22 అ	■	23 సి	24 జం
రి	■	25 వా	ద	26 న	■	■	27 క	న	28 కం	■	తు
జా	■	29 దు	మా	రం	■	■	30 పి	లు	పు	■	వు
31 తం	32 త్రి	■	మ	■	33 అ	34 వి	■	డు	■	35 పా	లు
■	36 ఘా	న్యం	■	37 అ	ను	మా	నం	■	38 ఇం	తి	■
39 ఫ	లం	■	40 ఉ	■	41 జ	నం	■	42 క	■	43 క	44 లి
తి	■	45 దా	రి	46 లో	■	■	47 హా	సి	48 ని	■	వ
49 తం	బు	ర	■	50 తు	ది	రే	యి	■	51 శ	ర	ణం

సుడొకు

7	6	5	4	1	3	9	8	2
9	8	3	7	6	2	1	4	5
1	2	4	9	8	5	7	6	3
4	5	8	1	3	6	2	7	9
3	1	7	2	9	4	8	5	6
2	9	6	8	5	7	3	1	4
5	4	1	3	7	9	6	2	8
8	3	2	6	4	1	5	9	7
6	7	9	5	2	8	4	3	1











ఓహో... పేపరు బాలా!










ఇక్కడున్న ఫొటోల్ని చూశారా... అమ్మాయికి అలంకరించిన ఆభరణాలు మొదలు అదిరిపోయే డ్రెస్సుల వరకూ ప్రతిదీ కాగితంతో తీర్చిదిద్దినదే. కాగితాన్ని మలుస్తూనో, కత్తిరిస్తూనో ఏదో ఒక రూపం తేవడం వేరు. కానీ అదే కళతో రంగుల కాగితాల్ని చూడచక్కని అమ్మాయిల్లా తయారుచేస్తే, ప్రాణం ఉన్న బొమ్మల్లా మలిస్తే- నిజంగా అద్భుతమే కదా! ఆ ఆలోచనతోనే కొందరు పేపర్ ఆర్టిస్టులు... జుట్టు నుంచి కనురెప్పల దాకా అన్నింటికీ కాగితాన్నే వాడుతూ, ముచ్చటైన కళాకృతులకు రూపమిచ్చారు. ఆ బొమ్మల్లో సొగసైన అతివల ముఖాల్నే కాదు, హావభావాల్నీ పలికిస్తున్నారు. వాటిని చూసినవారంతా 'ఎన్నో కళారూపాల్ని చూశాం కానీ కేవలం కాగితంతోనే ఇంత అందాన్ని తేవడం ఎంత అద్భుతం' అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారట.



బీచ్‌లన్నీ, సముద్రం- నేలను తాకే ప్రదేశాల్లోనే ఉంటాయా... మెక్సికోలోని ఓ బీచ్ మాత్రం- సముద్రం నడిమధ్యలో కనువిందు చేస్తోంది. అక్కడి మెరియేటాస్ దీవుల్లోని పెద్ద గుహలో కొలువుదీరిందీ అందాల బీచ్. పై నుంచి చూస్తే రాతి బిలంలా కనిపించే ఈ అరుదైన తీరాన్ని చేరడానికి పడవల్లో పయనమవుతారు పర్యటకులు. ఎగసిపడే కెరటాల్ని తనివితీరా ఆస్వాదిస్తూ, సాహసాల వాటర్‌గేమ్స్ ఆడుతూ సరదాగా రోజంతా గడిపి వస్తుంటారు!